ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

చిత్తూరు
జిల్లా వార్తలు
మంగళవారం 18 మార్చి 2025

ఇంకా వైసీపీ వీరవిధేయులే!

● ఎమ్మెల్యేలు కోరినా బదిలీ కాని పోలీసులు

● వైసీపీ నేతలతో సంబంధాల కొనసాగింపు

'నా నియోజకవర్గంలో ఓ ఏఎస్ఐ, ఓ హెడ్‌కానిస్టేబుల్ ఎన్నికల్లో వైసీపీ కోసం పని చేశారు. వైసీపీ అభ్యర్థికి టికెట్ కన్‌ఫర్మ్ అయినప్పుడు కలిసి పుష్పగుచ్ఛం అందించారు.వారిని బదిలీ చేయమని నెలలుగా ఎస్పీ మణికంఠను అడుగుతున్నా, స్పందన లేదు. వాళ్లేమో వైసీపీ ఇన్‌ఛార్జికి ఇన్‌ఫార్మర్లుగా ఉన్నారు. జీడీనెల్లూరుకు సీఎం చంద్రబాబు వచ్చినప్పుడు కూడా ఎస్పీకి మరోసారి అర్జీ ఇచ్చినా ఫలితం లేదు. ఇలాంటి అధికారులను చూస్తుంటే అనవసరంగా రాజకీయాల్లోకి వచ్చాననిపిస్తోంది.'

- ఓ ఎమ్మెల్యే ఆవేదన



చిత్తూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో ప్రభుత్వం మారి తొమ్మిది నెలలైనా జిల్లాలో ఇంకా వైసీపీ వీర విధేయ పోలీసులే పని చేస్తున్నారు.పార్టీ ముద్ర వేసుకున్న పోలీసులకు అధికారం మారినప్పుడు స్థానచలనం జరుగుతుంటుంది.అయితే ఈసారి అలా జరక్కపోవడంతో వారంతా స్థానిక వైసీపీ నాయకులకే విధేయులుగా ఉండడంతో అధికార పార్టీ నాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పక్క మండలాలకు మార్చాలని చెప్పినా ఎస్పీ మణికంఠ పట్టించుకోవడం లేదంటూ ఆవేదన చెందుతున్నారు. తాజాగా పుంగనూరులో టీడీపీ కార్యకర్త హత్య ఘటనలో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఇదే విషయాన్ని ప్రస్తావించి ఎస్పీ మణికంఠ తీరును తప్పుబట్టారు.మరికొందరు పోలీసు అధికారులు జిల్లా ఉన్నతాధికారి పేరు చెప్పుకుని స్థానిక ఎమ్మెల్యేలను, ప్రజాప్రతినిధులను లెక్క పెట్టకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

● తిరుపతి చర్యలు చిత్తూరుకు వర్తించవా?

తిరుపతిలో జరిగిన తొక్కిసలాటకు అప్పటి ఎస్పీ సుబ్బరాయుడికి సంబంధం లేకపోయినా వెంటనే బదిలీ చేశారు. సుబ్బరాయుడు సుదీర్ఘకాలం చంద్రబాబుకు సీఎస్‌వోగా పనిచేసినా వెనుకాడలేదు. కానీ, పోలీసుల వైఫల్యంతో ఏకంగా టీడీపీ కార్యకర్తను దారుణంగా నరికి చంపితే కేవలం సీఐని సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారని జిల్లా టీడీపీ నాయకులు చర్చించుకుంటున్నారు.

● పలమనేరు నియోజకవర్గంలో ఓ మహిళా పోలీసు అధికారి వైసీపీ హయాం నుంచీ పనిచేస్తున్నారు. ఆమె తంబళ్లపల్లె నియోజకవర్గంలో పనిచేస్తున్నప్పుడు ఆ ప్రాంత వైసీపీ నేత, ఎంపీ మిథున్‌రెడ్డి ముఖ్య అనుచరుడిని వివాహం చేసుకున్నారు. ఈ విషయం చెప్పి బదిలీ చేయమని కోరినా ఎస్పీ స్పందించడం లేదని అమరనాథ రెడ్డి మూడురోజుల క్రితం ప్రెస్‌మీట్‌లో చెప్పిన విషయం తెలిసిందే.

● బైరెడ్డిపల్లె స్టేషన్‌లో వైసీపీ హయాం నుంచీ పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ తమ్ముడు పలమనేరు మున్సిపాలిటీ వైసీపీ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. అతన్ని పక్క మండలానికి మార్చమని ఆరు నెలలుగా కోరుతున్నా ఫలితం లేదు.

● పలమనేరులో ఓ ఏఎస్ఐ వైసీపీ హయాం నుంచీ కొనసాగుతూ ఇల్లీగల్ వ్యవహారాలకు పాల్పడుతూ ఉన్నతాధికారులను మామూళ్లతో మేనేజ్ చేసేవాడు. ప్రభుత్వం మారాక ఇల్లీగల్ వ్యవహారాలు ఆపేసినా, వైసీపీతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నాడు. బైరెడ్డిపల్లెలో ఓ మహిళా కానిస్టేబుల్ గత ఎన్నికల్లో వైసీపీ కోసం పని చేసి ఇప్పటికీ అక్కడే ఉంటూ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నారు.

● పెద్దపంజాణి స్టేషన్‌లో ఓ కానిస్టేబుల్ వైసీపీ హయాంలో లిక్కర్ అమ్మకాలు చేసి పైఅధికారులకు మామూళ్లు ఇచ్చేవాడు. బదిలీ కోసం అమరనాథ రెడ్డి ఇచ్చిన జాబితాలో ఇతని పేరు కూడా ఉంది.

స్థానచలనం లేని పోలీసులు

● చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప దగ్గరి బంధువు పలమనేరు నియోజకవర్గంలోని ఓ స్టేషన్‌లో వైసీపీ హయాం నుంచీ రైటర్‌గానే పనిచేస్తున్నారు.

● వైసీపీ హయాంలో పలమనేరులో సీఐగా పనిచేసిన ఓ అధికారి ఇప్పుడు చిత్తూరులో కూడా కీలక స్థానంలో ఉన్నారు.తనకు ఉన్నతాధికారి అండ వుందని చెప్పుకునే అతడు స్థానిక ప్రజాప్రతినిధుల్ని లెక్కపెట్టడం లేదు. ఇటీవల ఓ దొంగతనం కేసులో నిందితుడి నుంచి ఏకంగా రూ.12.50లక్షలు తీసుకున్నా ఉన్నతాధికారులు అతన్ని కాపాడుతున్నారనే డిపార్ట్‌మెంటులో చెప్పుకుంటున్నారు.

● వైసీపీ హయాంలో నగరి కేంద్రంలో పనిచేసిన ఓ మహిళా అధికారి ఇప్పుడు జీడీనెల్లూరు నియోజకవర్గంలోనూ కీలక స్థానంలో కొనసాగుతున్నారు. అలాగే, చిత్తూరు సమీప స్టేషనులో మరో మహిళా అధికారి వైసీపీ హయాం నుంచీ కొనసాగుతున్నారు.

శాంతి భద్రతలు కాపాడ్డంలో విఫలం

జిల్లాలో జరిగిన కొన్ని ఘటనలు శాంతి భద్రతలు వైఫల్యానికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.పుంగనూరులో టీడీపీ కార్యకర్త రామకృష్ణ తన ప్రాణాలకు వైసీపీ నుంచి ముప్పుందని ముందే పోలీసులకు ఫిర్యాదు చేసినా, వీడియో విడుదల చేసినా చర్యలు తీసుకోలేదు.చివరకు ఆయన అత్యంత దారుణంగా హత్యకు గురయ్యాడు. ● నగరి మండలం తడుకుపేటలో రెండు సామాజికవర్గాల మధ్య విబేధాలొచ్చాయి. ఇరువర్గాల మధ్య పెద్దఎత్తున గొడవలు జరిగి వారం రోజులు శాంతి భద్రతలకు భంగం వాటిల్లింది.వీటిని ముందే పసిగట్టి మొగ్గలోనే కట్టడి చేయడంలో అక్కడి పోలీసులు విఫలమయ్యారు. ● క్రికెట్ ఆడుకుంటున్న సమయంలో బంతి తగిలిందని వి.కోటలో మొదలైన గొడవ.. ఇరు మతాల మధ్య తారస్థాయికి చేరింది. వారం రోజుల పాటు కలెక్టర్, ఎస్పీ అక్కడే మకాం వేయాల్సి వచ్చింది.దీన్ని కూడా మొగ్గలోనే తుంచడంలో పోలీసులు విఫలమయ్యారు. ● చిత్తూరులో ఇటీవల ఏడుగురు బయటి ప్రాంతాల వ్యక్తులు నకిలీ తుపాకులతో పట్టపగలే దొంగతనానికి పాల్పడి పోలీసుల పనితీరును ప్రశ్నించారు.

ముగిసిన రేషన్ సరుకుల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా రేషన్ సరుకుల పంపిణీ సోమవారంతో ముగిసింది. మొత్తం 5,36,755 బియ్యం కార్డులున్నాయి. 4,74,741 మంది కార్డుదారులు నేరుగా, పోర్టబిలిటీ ద్వారా సరుకులు తీసుకున్నారు. రేషన్ పంపిణీలో జిల్లా 12వ స్థానంలో నిలిచింది.

తవణంపల్లెలో 41.6డిగ్రీలు

పెరిగిన ఉష్ణోగ్రతలు- 7 మండలాల్లో వడగాడ్పులు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎండలు ఠారెత్తిస్తున్నాయి.వారం రోజులుగా పెరుగుతున్న ఎండలు సోమవారం గరిష్ఠానికి చేరుకున్నాయి. ఏడు మండలాల్లో వడగాడ్పులు వీచాయి.రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. తవణంపల్లెలో అధిక ఉష్ణోగ్రత 41.6 డిగ్రీలు నమోదు కాగా గంగవరంలో 40.5డిగ్రీలు, పులిచెర్లలో 40.3, నింద్రలో 40.3డిగ్రీలు నమోదయ్యాయి. గుడుపల్లెలో 39.9, శ్రీరంగరాజపురంలో 39.9, పలమనేరులో 39.8,నగరిలో 39.2, సోమలలో 39, రొంపిచెర్లలో 38.7, శాంతిపురంలో 38.6, చిత్తూరులో 38.5, గుడిపాలలో 38.5, చౌడేపల్లి, ఐరాల, పాలసముద్రం, సదుం, విజయపురం మండలాల్లో 38.2 చొప్పున, వి.కోటలో 38, బంగారుపాళ్యంలో 37.7, పెద్దపంజాణిలో 37.6, వెదురుకుప్పంలో 37.4, పెనుమూరు, యాదమరి మండలాల్లో 37.3, బైరెడ్డిపల్లిలో 37.1, పూతలపట్టులో 37, రామకుప్పంలో 36.5, గంగాధరనెల్లూరు, కుప్పం మండలాల్లో 36.3, పుంగనూరులో 36.2, కార్వేటినగరంలో 34.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో రెండ్రోజులపాటు ఇదేవిధంగా వడగాడ్పులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

సౌదీలో పెనుమూరువాసి మృతి

పెనుమూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలం ఎగువ పూనేపల్లె గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ 20 ఏళ్లుగా సౌదీలో పనిచేస్తున్నాడు. ఈనెల మూడో తేదీన గుండెనొప్పి రావడంతో ఆదేశంలోనే ఉన్న బావమరిది మహబూబ్ బుర్హాన్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు కోమాలోకి వెళ్లిపోయాడని నిర్ధారించారు. ఆ తర్వాత చికిత్స పొందుతూ సోమవారం ఉదయం ఐదు గంటలకు మరణించాడని హుస్సేన్ భార్య, ముగ్గురు కుమార్తెలకు మహబూబ్ సమాచారం ఇవ్వడంతో వారు బోరున విలపించారు. హుస్సేన్ మృతదేహాన్ని ఇండియాకు తెప్పించాలంటూ ఓ వీడియో ద్వారా మంత్రి లోకేశ్‌కు మొరపెట్టుకున్నారు. ఇది తెలిసిన జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ వెంటనే హుస్సేన్ కుటుంబీకులు ఫోన్ చేశారు. తన సొంత ఖర్చుతో మృతదేహాన్ని తీసుకొస్తానని తెలిపారు.

గంజాయి స్వాధీనం:ఏడుగురిపై కేసు

చిత్తూరు అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో 2.370 కిలోల గంజాయిని సోమవారం రెండో పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురిపై కేసు నమోదు చేశారు. సీఐ నెట్టికంఠయ్య తెలిపిన వివరాల మేరకు.. కొంతకాలంగా చిత్తూరు నగరంలో గంజాయి రవాణా, విక్రయాలపై పోలీసులు నిఘా పెట్టారు. ఇరువారం సమీపంలోని ఓ గోడౌన్‌లో గంజాయి నిల్వ ఉంచారని సమాచారం అందింది. ఆ గోడౌన్‌పై దాడి చేశారు. నగరానికి చెందిన అల్లా బక్ష్, శెల్వం, లోకేష్, సురేష్, రాజేష్, తమిళనాడుకు చెందిన ధనుష్, సూర్యలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 2.370 కిలోల గంజాయిని సీజ్ చేశారు. మూడు కత్తులు, మూడు ద్విచక్ర వాహనాలు, ఓ కారు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

పలువురు తహసీల్దార్ల బదిలీ

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు తహసీల్దార్లను, డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రామకుప్పం తహసీల్దార్ బాబును వెదురుకుప్పానికి డిప్యూట్ చేయగా, పూతలపట్టు తహసీల్దార్ గుర్రప్పను కలెక్టరేట్‌కు డిప్యూట్ చేశారు.బైరెడ్డిపల్లె తహసీల్దార్ మాధవరాజును గంగవరానికి బదిలీ చేశారు.శాంతిపురం డిప్యూటీ తహసీల్దార్ కౌలేష్‌ను రామకుప్పం తహసీల్దార్(ఎఫ్ఏసీ)గా, వెదురుకుప్పం తహసీల్దార్ రమేష్‌బాబును పూతలపట్టు తహసీల్దార్‌గా, కలెక్టరేట్‌లోని డీఎస్‌వో ఆఫీస్‌లో డీటీ శ్యాంప్రసాద్‌రెడ్డిని బైరెడ్డిపల్లె తహసీల్దార్‌గా నియమించారు.కుప్పం ఆర్డీవో కార్యాలయంలో డీటీ ప్రసన్నకుమార్‌ను శాంతిపురం తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా నియమించారు.

రామకృష్ణ హత్యకు పెద్దిరెడ్డి అనుచరుడే మూలకర్త

ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు

రాజకీయకక్షతోనే హత్యకు ఐదుగురి కుట్ర

పలుకేసుల్లో ముద్దాయిలైన నిందితులు

కేసులో జోక్యమున్నవారు ఎంతటివారైనా వదిలేది లేదన్న ఎస్పీ మణికంఠ



హత్యకు ఉపయోగించిన వేటకొడవలి



రామకృష్ణ హత్య కేసులో నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్పీ మణికంఠ

పుంగనూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి):రాజకీయంగా అడ్డుగా ఉన్నాడనే కారణం కక్షగా మారి టీడీపీ కార్యకర్తను బలిగొంది. మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రధాన అనుచరుడు వెంకట్రమణ మరో నలుగురితో కలిసి పథకం మేరకు కిరాతకంగా వేటకొడవలితో టీడీపీ కార్యకర్త కె.రామకృష్ణను హతమార్చారని ఎస్పీ మణికంఠ వెల్లడించారు.పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్పీ కథనం మేరకు .... పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీ కృష్ణాపురం గ్రామానికి చెందిన రైతు కాగతి రామకృష్ణ టీడీపీ కార్యకర్తగా చురుగ్గా పనిచేస్తూ భూఆక్రమణలను, అవినీతి వ్యవహారాలను, ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేవారు.సీఎం చంద్రబాబు ప్రమాణస్వీకార సందర్భంగా రామకృష్ణ కుటుంబం సంబరాలు జరుపుకుని కేక్ కట్ చేయబోగా వైసీపీ కార్యకర్త వెంకట్రమణ, మరో వ్యక్తి గొడవచేసి రామకృష్ణ భార్య కాళ్లు విరిగేలా కొట్టారు. అంతేకాకుండా రామకృష్ణ కుటుంబంతో తరచూ గొడవ పడేవారు. గత నెల 10వ తేది మట్టి టిప్పర్ తమ స్థలంలో వెళ్లిందంటూ వెంకట్రమణ మరికొందరు గొడవకు దిగారు. రామకృష్ణ కుమారుడు, కోడలిపై దాడి చేసి గాయపరిచారు. అప్పట్లో పుంగనూరు సీఐ ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. కానీ సీఐ కేసును సీరియస్‌గా తీసుకోకపోవడంతో దర్యాప్తులో పురోగతి లేదు. రాజకీయ కక్షలు తీవ్రస్థాయికి వెళ్లి పుంగనూరు మండలం గానుగులగడ్డకు చెందిన వైసీపీ నాయకుడు, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ప్రధాన అనుచరుడు ఎం.రెడ్డెప్ప రెడ్డి పథకం ప్రకారం హత్యకు మూలకర్తగా వ్యవహరించారు.రామకృష్ణ కుమారుడు సురేశ్‌ను చంపాలని వెంకట్రమణ వేటకొడవలితో నరకడానికి ప్రయత్నించగా చెయ్యి అడ్డుపెట్టి తప్పించుకున్నాడు. ఈలోపు ట్రాక్టర్‌లో ఇంటికి వచ్చిన రామకృష్ణను వెంకట్రమణ దారుణంగా కొడవలితో నరికి చంపి పారిపోయాడు. ఎం.వెంకటరెడ్డి పథకం ప్రకారం రామకృష్ణతో విబేధాలున్న మహేశ్ వేటకొడవలి ఏర్పాటు చేయగా అతని భార్య రజని, మరో వ్యక్తి త్రిలోక్ నాయుడు కుట్రలో భాగస్వాములయ్యారు. రామకృష్ణ హత్యపై పోలీసులు హత్య, హత్యాయత్నం, మోసపూరితకుట్రగా కేసులు నమోదు చేసి ప్రధాన నిందితుడు వెంకట్రమణను, ఎం.రెడ్డెప్పరెడ్డిని అరెస్టు చేశారు. నిందితులపై భూఆక్రమణలు, మహిళలపై దాడి, ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురిచేయడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు కేసులున్నాయని ఎస్పీ మణికంఠ వివరించారు. మిగిలిన ముగ్గురు నిందితులను అరెస్టు చేయడానికి ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయన్నారు. హత్యాయుధాన్ని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు.ప్రధానకుట్రదారుడు రెడ్డెప్ప రెడ్డి హత్యకు ముందు తర్వాత నిందితులతో ఫోన్ సంభాషణలోనే ఉన్నాడు. అలాగే వైసీపీకి చెందిన పుంగనూరు ఎంపీపీ అక్కిసాని భాస్కర రెడ్డి, పీకేఎం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మాజీ ఛైర్మన్ ఎన్.వెంకటరెడ్డియాదవ్, వైసీపీ నేత చెంగారెడ్డిలతో నిందితుడు వెంకట్రమణకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, దీనిపై సమగ్రంగా విచారిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.డీఎస్పీ ప్రభాకర్, రూరల్ సీఐ రాంభూపాల్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రంలో ఇన్‌ఛార్జి కలెక్టర్ విద్యాధరి తనిఖీలు



చిత్తూరులోని నారాయణ పాఠశాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

టెన్త్ పరీక్షలు ప్రారంభం

చిత్తూరు సెంట్రల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 118 కేంద్రాల్లో సోమవారం టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. అరగంట ముందే విద్యార్థులను తనిఖీ చేసి, పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. స్థానిక గిరింపేటలోని నగరపాలక ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని ఇన్‌ఛార్జి కలెక్టర్ విద్యాధరి పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.పరీక్ష కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలులో ఉన్నా, పలు కేంద్రాల వద్ద ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు ఉండటం పలు విమర్శలకు తావిచ్చింది. జిల్లా వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో డెస్కులు లేకపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఒంటి పూట బడుల నేపథ్యంలో పరీక్ష కేంద్రాలున్న పాఠశాలలకు మధ్యాహ్నం వచ్చే విద్యార్థులకు భోజనం తయారీని సమీప పాఠశాలల్లో చేయించాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. తొలి రోజు నిర్వహించిన తెలుగు పరీక్షకు 20810 మంది విద్యార్థులకు 19,929 మంది హాజరవగా, 881 మంది గైర్హాజరైనట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. జనరల్ టెన్త్‌లో 20,746 మందికి 19,890 మంది హాజరవగా, 856 మంది గైర్హాజరయ్యారు. డీఈవో వరలక్ష్మి రెండు పరీక్ష కేంద్రాలను, 13 ఫ్లైయింగ్ స్క్వాడ్లు 59 కేంద్రాలను పరిశీలించాయి. 41 కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్లు పరీక్షలను పర్యవేక్షించాయి. ఓపెన్ స్కూల్లో 64 మందికి 39 మంది హాజరవగా 25 మంది గైర్హాజరైనట్లు డీఈవో తెలిపారు.



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



చిత్తూరులోని గిరింపేట పాఠశాల వద్ద తల్లిదండ్రులతో విద్యార్థులు

భారతీయ జీవనశైలిలో వేదాల అనుసరణ

● కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వేద రక్షణతోనే లోక రక్షణ సాధ్యమవుతుందని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి అన్నారు. వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో సోమవారం దక్షిణాది రాష్ట్రాల వేద సమ్మేళనాన్ని వర్చువల్ ద్వారా ఆయన ప్రారంభించారు. మూడు రోజుల పాటు కొనసాగే కార్యక్రమంలో శంకర విజయేంద్ర సరస్వతి అనుగ్రహ భాషణం చేశారు. భారతీయ జీవన శైలి వేదాలను అనుసరించి ఉందన్నారు. గ్రామ స్థాయి నుంచీ వేదపరిరక్షణ చర్యలు అవసరమన్నారు. జ్యోతిషం, పురాణాలు, ఇతిహాసాలు, నీతి, యోగ శాస్త్రాలను వేదాలతో అనుసంధానించాలన్నారు. వేద వర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి, సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి, ఉజ్జయినిలోని సాందీపని రాష్ట్రీయ వేద విద్యా ప్రతిష్ఠానం కార్యదర్శి విరుపాక్ష జడ్డిపాల్‌లు మాట్లాడుతూ.. వేద పరిరక్షణ అందరి కర్తవ్యమన్నారు. మంచి జీవన విధానాన్ని అనుసరించడం ద్వారా గొప్ప ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రజల్లో ధార్మిక చైతన్యం పెరగాలన్నారు. ప్రతి ఇంట్లో వేద పారాయణం, గో సంరక్షణ చేపట్టాలన్నారు. అమలధారి సింహ సంకలనం చేసిన 'వేద కల్పవృక్ష', 'వేద మహార్నవ' అనే గ్రంథాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేద వర్సిటీ రిజిస్ట్రార్ భాస్కరుడు, పలు ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు.



వేద సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న విరుపాక్ష జడ్డిపాల్, చిత్రంలో వేదవర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి తదితరులు


శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.46 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 82,721

తలనీలాలు సమర్పించినవారు: 27,261



పారని చోరుల పన్నాగం

దొంగను పట్టించిన ఎల్‌హెచ్‌ఎంఎస్ ● పరారీలో మరో నిందితుడు

తిరుచానూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పోలీసుల పథకం ఫలించింది. ఓ దొంగను పట్టించింది. తిరుచానూరు నుంచి నారాయణాద్రి ఆస్పత్రికి వెళ్లే మార్గంలో పీజీ గార్డెన్స్‌లో విశ్రాంత ఉద్యోగి రోశబ్బ ఉంటున్నారు. రెండు రోజుల క్రితం కుటుంబంతో వేరే ఊరికి వెళ్లారు. వెళ్లేముందు ఆయన పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఆ ఇంటికి లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్)ను ఏర్పాటు చేశారు. ఈక్రమంలో సోమవారం వేకువజామున ఇద్దరు దొంగలు రోశబ్బ ఇంట్లోకి చొరబడ్డారు. వారు చోరీకి యత్నిస్తుండగా ఎల్‌హెచ్‌ఎంఎస్ పోలీసు కంట్రోల్‌రూమ్‌ను అప్రమత్తం చేసింది. దీంతో కొద్ది నిమిషాల్లోనే సీఐ సునీల్‌కుమార్ నేతృత్వంలో ఎస్‌ఐ సాయినాథ్ చౌదరి, బ్లూకోల్ట్ సిబ్బంది పూర్ణచంద్రరావు, శ్రీనివాసులు ఆ ఇంటికి చేరుకున్నారు. చాకచక్యంగా లోనికి ప్రవేశించారు. ఈలోగా వీరి అలికిడికి ప్రధాన నిందితుడు లక్ష్మణ్ ఇంటి వెనుక నుంచి తప్పించుకున్నాడు. అతనితో వచ్చిన సయ్యద్ ఇబ్రహీం మాత్రం పోలీసులకు పట్టుబడ్డాడు. ఇతను తమిళనాడులోని కడలూరుకు చెందిన వాడు. లక్ష్మణ్ కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. ఇతనిది తమిళనాడులోని కల్లకుర్తి. కాగా నిందితుల కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో కత్తులు, రాడ్లు ఉన్నట్లు తెలిసింది. ప్రధాన నిందితుడు ఏపీ,తమిళనాడుల్లో పలు చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం. ఊళ్లకు వెళ్తున్నప్పుడు ఇంటి యజమానులు సమాచారమిస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ అనుసంధానం చేస్తామని పోలీసులు చెప్పారు. తాజాగా సయ్యద్ ఇబ్రహీం ఇలాగే పట్టుబడ్డాడని తెలిపారు.





పట్టుబడిన మహ్మద్ సయ్యద్ ఇబ్రహీం - ఇంట్లో చోరీకి యత్నిస్తున్న లక్ష్మణ్

అలిపిరిలో సాధువుల ఆందోళన

● బీసీవై నేత రామచంద్రయ్య యాదవ్ మద్దతు

● కాలినడకన తిరుమలకు

తిరుపతి/తిరుమల, మార్చి17(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం అలిపిరి సమీపంలో ఒబెరాయ్ గ్రూప్‌కు చెందిన 7స్టార్ హోటల్ నిర్మాణాన్ని వ్యతిరేకంగా సాధువులు సోమవారం ఆందోళనకు దిగారు. హోటల్‌కు ఇచ్చిన భూ కేటాయింపులు రద్దుచేయాలని, నిర్మాణాలను కూల్చివేయాలని డిమాండు చేశారు. అలిపిరిలో దీక్ష ప్రారంభించిన వీరు పాదయాత్రగా తిరుమలకు బయలుదేరుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. అలిపిరిలోని యాత్రికుల విశ్రాంత భవనం పక్కన కూర్చోబెట్టారు. ఎక్కువ సంఖ్యలో కాలినడకన వెళ్లడం వల్ల సాధారణ భక్తులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉందని పోలీసులు నచ్చజెప్పారు. ఇంతలో వీరికి మద్దతుగా బీసీవై పార్టీ నేత రామచంద్ర యాదవ్ తన అనుచరగణంతో అలిపిరి చేరుకున్నారు. వారితో కలసి నినాదాలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమల పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. నెయ్యి కల్తీపై ఎవరికి తోచింది వారు చెబుతున్నారని, కల్తీ జరిగిందా? లేదా? అనేదానిపై ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో గోశాలలు ఏర్పాటుచేసి, వాటినుంచి వచ్చే పాలు, నెయ్యిని మాత్రమే శ్రీవారికి వినియోగించాలని తాను కోరానన్నారు.గోవులతోపాటు 25 ఎకరాల మామిడితోటను గోశాలకు ఉచితంగా ఇస్తానని చెప్పినా వినిపించుకోలేదన్నారు. అలిపిరి వద్ద భూములు ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టి, ధార్మిక విరుద్ధమైన కార్యక్రమాలు మొదలుపెట్టారో, వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తిరుమల పవిత్రత కోసం సాధువులతో కలిసి పాదయాత్రగా కొండకు వెళుతున్నట్టు చెప్పారు. ఇంతలో తిరుమల పోలీసులు శ్రీనివాస సరస్వతితో పాటు రామచంద్రయ్య యాదవ్‌కు నోటీసులు అందజేశారు. తిరుమల కొండపై ఎలాంటి రాజకీయ ప్రసంగాలు, విమర్శలు చేయకూడదని, నిరసనలకు పాల్పడరాదని, ఆధ్యాత్మిక వాతావరణానికి భంగం కలిగించకూడదని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. గోవుకు పూజ చేసి నడకమార్గం ద్వారా తిరుమలకు బయలుదేరారు. కొండపైకి చేరిన వీరు పోలీసుల నోటీసులను విస్మరించారు. తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా, శ్రీవారి ఆలయం ముందు.. అఖిలాండం వద్దకు నిరసనకు కూర్చున్నారు. నినాదాలు చేశారు. పోలీసులు నచ్చచెప్పినా వినిపించుకోలేదు. చివరకు వీరందరినీ లాగి.. వాహనాల్లో తిరుపతికి, వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. వీరిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. కాగా, తిరుమలలో ప్రకాశన జరిగే వరకు పోరాటం సాగిస్తామని బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ చెప్పారు. తిరుమలలో ఈయన్ను అదుపులోని తీసుకున్న పోలీసులు భాకరాపేట పోలీసు స్టేషన్‌కు తరలించారు.



అలిపిరి వద్దకు చేరిన సాధువులు



తిరుమలలో నిరసనలు చేపట్టరాదని చెబుతున్న పోలీసులు

శేషాచలం జీవ వైవిధ్యానికి నెలవు

బయో డైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవులు జీవ వైవిధ్యానికి నెలవు అని ఏపీ బయో డైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శేషాచలం - జీవ వైవిధ్యం అంశంపై ఎస్వీయూ సెనేట్ హాల్లో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. శేషాచలాన్ని ఓ జీవ నిధిలా అభివర్ణించారు. జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవడానికి ప్రజల సహకారం అవసరమన్నారు. తిరుమలను కాంక్రీట్ జంగిల్‌గా మార్చొద్దన్నారు. చిన్ననాటి నుంచే జీవ వైవిధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. బోధన, పరిశోధనల్లోనే జీవ వైవిధ్యం పట్ల ప్రత్యేక దృష్టి అవసరమన్నారు. శేషాచలంలో కొన్ని జీవ జాతులు అంతరిస్తున్న విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. నగరాల్లో పచ్చదనాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు అవసరమన్నారు. డీఎఫ్‌ఓ వివేక్ మాట్లాడుతూ రాయలసీమలో నీటి వనరులున్న ఏ ప్రాంతమైనా జీవ వైవిధ్యంతో పాటు ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు పొందిందన్నారు. శేషాచలంలో జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు అటవీ శాఖ తనవంతు పాత్ర పోషిస్తోందన్నారు. ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు మాట్లాడుతూ జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు యూనివర్సిటీ తనవంతు సహకారం అందిస్తుందని తెలిపారు. తుడా కార్యదర్శి వెంకటనారాయణ, నవీన్‌కుమార్, బాలాజీ శ్రీవత్స, బీవీ రమణ, యూనివర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి మాట్లాడుతూ నిర్మాణాల కోసం తిరుమలలో చెట్లను తొలిగించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్స్ హరికృష్ణ పాకనాటి, అక్షర ఫౌండేషన్ అధినేత మద్దినేని హరిబాబు, బోటనీ అధ్యాపకులు డాక్టర్ కామాక్షమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, విజయ్‌కుమార్ తదితరులు

పుత్తూరు మున్సిపాలిటీలో పునర్విచారణ

● పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్ ఆధ్వర్యంలో కమిటీ

● సభ్యులకు దిశా నిర్దేశం చేసిన ఆర్డీ మురళీ కృష్ణ

పుత్తూరు అర్బన్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో 2019-24 మధ్య అవినీతిపై పునర్విచారణకు ఆర్డీ ఆధ్వర్యంలో కమిటీ చేరుకుంది. విచారణ కమిటీ సభ్యులకు సోమవారం ఆర్డీ దిశా నిర్దేశం చేశారు. విచారణ కమిటీలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్, ఈఈ సుబ్బరాయుడు, డీఈ పుష్పగిరి నాయక్, ఏఈ విష్ణుతో పాటు మరో క్లర్క్ ఉన్నారు. కమిటీ సభ్యులు విచారణను వేగవంతం చేస్తున్నారు. ముందుగా డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. గతంలో డంపింగ్ యార్డ్ వద్ద చేపట్టిన పనుల్లో అవినీతి జరిగిందని, ఎక్స్‌కవేటర్ అద్దె చెల్లించినట్లుగా బిల్లులు కాజేశారన్న ఆరోపణల నేపథ్యంలో ఆ దిశగా విచారణ చేపట్టారు. అలాగే 14వ ఆర్థిక సంఘం ద్వారా చేపట్టిన పైప్ పనులను కూడా కమిటీ సభ్యులు పరిశీలించారు. కార్యాలయంలో వివిధ ఫైళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌కు ఖర్చు చేసిన నిధులు, ఇతర అంశాలను కమిటీ సభ్యులు క్షుణ్ణంగా తనిఖీ చేయనున్నారు. ప్రస్తుత కమిటీలో పాత వారు ఎవరూ లేరని, అందరూ కొత్త సభ్యులని ఆర్డీ మురళీకృష్ణ వివరణ ఇచ్చారు.



కమిటీ సభ్యులకు దిశా నిర్దేశం చేస్తున్న ఆర్డీ మురళీకృష్ణ

వైసీపీ కోఆర్డినేటర్ అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన సతీమణి సుధారెడ్డిపై అసత్య ప్రచారాలు చేశారని నమోదైన కేసులో వైసీపీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ చరణ్‌తేజను తిరుపతి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు... తిరుపతి రూరల్ పుదిపట్లకు చెందిన వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ చరణ్‌తేజ.. ఎమ్మెల్యే నాని, సుధారెడ్డిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ తిరుపతి రూరల్‌కు చెందిన చింతకాని సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రజలను రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన కారణంగా సోమవారం చెర్లోపల్లి-చంద్రగిరి రహదారిలోని పెట్రోలు బంకు వద్ద అతన్ని అరెస్టు చేశారు. మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా ఈనెల 28వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు సీఐ చెప్పారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

● తొలిరోజు 299 మంది గైర్హాజరు



పరీక్షా కేంద్రం వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్ తనిఖీలు



హాల్ టిక్కెట్ నెంబర్లను చూసుకుంటూ..



పరీక్షకు ముందు తల్లిదండ్రులతో వీడియో కాల్



పరీక్షా కేంద్రం వద్ద ఓ తల్లి సెల్ఫీ



తిరుపతి అర్బన్ జీవకోనలోని విశ్వం స్కూల్ వద్ద విద్యార్థులు



తల్లిదండ్రుల ఆశీర్వాదం

తిరుపతి(విద్య), మార్చి 17(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. 164 కేంద్రాల్లో తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షకు 299 మంది గైర్హాజరయ్యారు. 26,803కుగాను 26,504 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. తొలి రోజు పరీక్షకు విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కూడా పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు.ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల 7.30 గంటల నుంచే పరీక్ష కేంద్రాలవద్దకు రావడం మొదలుపెట్టారు. మరోవైపు నగరంలోని ఆలయాల వద్ద విద్యార్థులు మొక్కుతూ కనిపించారు. పరీక్ష ప్రారంభమైన తరువాత కూడా కేంద్రాలవద్ద నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు వెళ్లకపోవడంతో కొన్ని చోట్ల పోలీసులు బలవంతంగా వారిని అక్కడినుంచి పంపించాల్సి వచ్చింది. పది పరీక్షలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం పటిష్ఠ చర్యలు చేపట్టింది. అన్ని కేంద్రాలవద్ద గట్టి భద్రతా చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని నాలుగు సమస్యాత్మక పరీక్ష కేంద్రాలవద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. విద్యార్థులను పూర్తిగా తనిఖీ చేశాకే కేంద్రాల్లోకి అనుమతించారు. కేంద్రాల సమీపంలో జెరాక్స్ సెంటర్లను, ఇంటర్‌నెట్ సెంటర్లను ముందుగానే మూయించారు. ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి తీసుకువెళ్లకుండా జాగ్రత్త వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పది ఫ్లయింగ్ స్క్వాడ్లు కేంద్రాలను తనిఖీ చేశాయి. 30 మంది సిట్టింగ్ స్క్వాడ్లు ఆయా కేంద్రాల్లో ఉన్నాయి. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ లాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు.

ఉమ్మడి జిల్లా ఎన్ఎస్ఎస్ యూనిట్లకు నిధుల మంజూరు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : 2024-25 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని యూనివర్సిటీలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో చేపట్టిన ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలకు సంబంధించిన నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ● ఎస్వీయూ పరిధిలోని 160 ఎన్ఎస్ఎస్ యూనిట్లకు రూ.32.64లక్షలు ● పద్మావతి వర్సిటీకి రూ.3,26,400 ● ద్రవిడ వర్సిటీకి రూ.1,22,400 ● ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి రూ.3,67,200 ● ఎస్వీ వేద విశ్వవిద్యాలయానికి రూ.40,800 ● జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి రూ.61,200 ● శ్రీసిటీ ట్రిపుల్ ఐటీకి రూ.61,200 ● చిత్తూరు అపోలో యూనివర్సిటీకి రూ.40,800 మంజూరయ్యాయి.

'కుప్పం'లో ఉపాధి పనులపై విజి'లెన్స్'

తిరుపతి(నేరవిభాగం), మార్చి 17(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో కుప్పం నియోజకవర్గంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్సు అధికారులు దృష్టి పెట్టారు. ప్రాథమికంగా జిల్లా అధికారుల నుంచి రికార్డులు తెప్పించుకున్నారు. మండలాల వారీగా ఏటా ఎన్ని పనులు మంజూరయ్యాయి? ఎన్ని పూర్తి చేశారు? ఏఏ పనులకు బిల్లులు డ్రా చేశారనే కోణంలో దర్యాప్తు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. శాంతిపురం, గుడుపల్లె, కుప్పం, రామకుప్పం మండలాల పరిధిలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో అప్పట్లో అవినీతి అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వచ్చాయి. వీటిపై కొందరు ఫిర్యాదులు కూడా చేసినట్లు తెలిసింది. ఓ ప్రజాప్రతినిధిపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఇష్టానుసారంగా పనులు చేసి, బిల్లులు డ్రా చేసి స్వాహా చేసినట్లు విమర్శలున్నాయి. వీటిపై విజిలెన్సు అధికారులు.. తొలుత రికార్డులను పరిశీలించనున్నారు. ఆ తర్వాత క్షేత్రస్థాయిలో వీటిని పరిశీలించనున్నారు. ఇలా సమగ్ర దర్యాప్తునకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

ఫిర్యాదుదారులను స్టేషన్ల చుట్టూ తిప్పితే చర్యలు

పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలన్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కుంటి సాకులు చెప్పి ఫిర్యాదుదారులను పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పితే చర్యలు తప్పవని ఎస్పీ హర్షవర్ధనరాజు హెచ్చరించారు. ఒకే సమస్యపై పదే, పదే వచ్చే వారిని విచారించి సంబంధిత అధికారులను బాధ్యులను చేసి చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతిలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పీజీఆర్ఎస్ కోసం ఇద్దరు అదనపు ఎస్పీలు, తొమ్మిది మంది సీఐలు, సిబ్బందిని నియమించామని గుర్తు చేశారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులు ఎక్కడా పెండింగ్‌లో ఉండకూడదన్నారు. ప్రతి వారం తన దృష్టికి వస్తున్న సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆదేశించారు. సోమవారం పీజీఆర్ఎస్‌కు 92 ఫిర్యాదులు రాగా.. దాదాపు పదింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ట్రైనీ ఎస్పీ హేమంత్, అదనపు ఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

పొలాలపై ఒంటరి ఏనుగు విధ్వంసం



ఒంటరి ఏనుగు దాడిలో విరిగిన కొబ్బరి చెట్టు, ధ్వంసమైన మామిడి చెట్టు

కల్లూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేట, పాళెం పంచాయతీ పరిధిలో ఆదివారం రాత్రి పంట పొలాల్లో ఒంటరి ఏనుగు విధ్వంసం సృష్టించింది. వరి పంటను తొక్కేసింది. కొబ్బరి, మామిడి చెట్లను, ఒక విద్యుత్ స్తంభాన్ని విరిచేసింది. ముందుగా దేవళంపేట పంచాయతీ తూర్పు విభాగం అటవీప్రాంతంలోని చింతల వంక, సూరప్పచెరువు నుంచి బయలుదేరిన ఏనుగు కుమ్మరిపల్లిలోని రైతు చంద్రమోహన్‌కు చెందిన రెండు కొబ్బరి, మూడు మామిడి చెట్లను విరిచేసింది. అదే గ్రామంలోని రైతు గోవిందయ్యకు చెందిన పనసచెట్టును విరిచేసి పశుగ్రాసాన్ని నాశనం చేసింది. విద్యుత్ స్తంభాన్ని విరిచేసింది. నారాయణకు చెందిన వరి పంటను తొక్కేసింది. పాళెం పంచాయతీ కొంగరవారిపల్లి సమీపంలోని రైతు కమలనాథ నాయుడుకు చెందిన వరిపంటను తొక్కేసింది. ఆ తర్వాత వచ్చిన దారిలోనే తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక, సూరప్పచెరువు వద్దకు చేరుకుంది.

గండ్రాజుపల్లె ఎస్టేట్‌లో చోరీల కేసులో ఒకరి అరెస్ట్

గంగవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గండ్రాజుపల్లె సమీపంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పలు చోరీలకు పాల్పడిన నిందితుడిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ కథనం మేరకు... ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పలు హోటళ్లు, నివాస గృహాల వద్ద గతంలో జరిగిన చోరీలపై కేసులు దర్యాప్తులో ఉన్నాయి. ఈ క్రమంలో ఆదివారం రాత్రి నాలుగురోడ్ల గ్రామం సమీపంలో ఫ్లైఓవర్ వద్ద ఓ వ్యక్తి సిలిండర్లతో అనుమానాస్పదంగా కనిపించాడు. విచారించగా పొంతనలేని సమాధానం చెప్పాడు. స్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తే గంగవరం మండలం నల్లతుమ్మనపల్లె గ్రామానికి చెందిన శివ అలియాస్ శివశంకర్‌గా తేలింది. ఇతడు గ్యాస్ సిలిండర్లు, బ్యాటరీలు, మోటర్లతోపాటు పలు సామగ్రిని చోరీ చేసి విక్రయించేవాడని అంగీకరించాడు. అతడు తెలిపిన వివరాల మేరకు పలు గ్యాస్ సిలిండర్లు, బ్యాటరీలు, మోటర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కోర్టుకు తరలించారు.

యాదమరి పాఠశాలలో టీవీ చోరీ

యాదమరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): యాదమరి జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం రాత్రి ఓ గదిని తలుపు పగులగొట్టి అక్కడున్న టీవీ అపహరించుకెళ్లారు. సోమవారం ఉదయం గమనించిన ప్రధానోపాధ్యాయుడు గిరిరాజా పోలీసులకు సమాచారం ఇచ్చారు. మూడు నెలల వ్యవధిలో మండల పరిధిలోని కొటాల, పచ్చాపూరు (పాచిగుంట) స్కూళ్లలోనూ టీవీలు చోరీకి గురయ్యాయి. యాదమరి పాఠశాలలో రాత్రివేళలో గస్తీ ఏర్పాటు చేయాలని పోలీసులను గ్రామస్తులు కోరుతున్నారు.

పదోన్నతుల్లో మాకు అన్యాయం

- ఇన్‌చార్జి కలెక్టర్‌కు ఏఎన్ఎంల ఫిర్యాదు

చిత్తూరు రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో గ్రేడ్-3 ఏఎన్ఎంల పదోన్నతుల్లో తమకు అన్యాయం జరిగిందని మదనపల్లెలో పనిచేస్తున్న కొందరు ఏఎన్ఎంలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఇన్‌చార్జ్ కలెక్టర్ విద్యాధరి, డీఎంహెచ్‌వో సుధారాణిని కలిసి ఫిర్యాదు చేశారు. తామంతా మదనపల్లె మున్సిపాలిటీలో వార్డు సచివాలయాల్లో హెల్త్ సెక్రటరీలుగా పనిచేస్తున్నామని చెప్పారు. గతనెల 21వ తేదీన ప్రమోషన్ లిస్టును జిల్లా వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేసిందన్నారు. అందులో తాము ప్రమోషన్ లిస్ట్‌లో ఉన్నామన్నారు. తర్వాత విడుదలైన ప్రమోషన్ ప్రపోజల్ కేటగిరీ లిస్టులో తమ పేర్లు లేవని తెలిపారు. అందులో తమకన్నా కింద ఉన్నవారి పేర్లు ఉన్నాయని చెప్పారు. విచారించి, న్యాయం చేయాలని కోరారు.

వెదురు పెంపకాన్ని ప్రోత్సహించాలి

- డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వెదురు పెంపకాన్ని ప్రోత్సహించాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి ఆదేశించారు. సోమవారం స్థానిక టీటీడీసీ కార్యాలయంలో వెదురుపెంపకంపై చిత్తూరు, ప్రకాశం, తిరుపతి, అన్నమయ్య, నంద్యాల జిల్లాలకు సంబంధించి ఎంపిక చేసిన ఏపీఎంలు, సీసీలతో రెండ్రోజుల వర్క్‌షాపు ప్రారంభమైంది. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. వెదురుకు డిమాండ్ ఉందని, అతి తక్కువ ఖర్చుతో ఎలాంటి భూముల్లోనైనా ఈ పంటను సాగు చేయవచ్చన్నారు. డ్వాక్రా గ్రూపుల్లోని మహిళా రైతులు వెదురు పెంపకంపై దృష్టి పెట్టేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. దీనికి ఇండస్ట్రీ ఫౌండేషన్ పూర్తి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ శాస్త్రవేత్తలు అశోక్, కుసుమ, అమృత, శ్రీకాంత్, డీఆర్‌డీఏ డీపీఎంలు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

మొదలైన 'ఇంటర్మీడియట్' మూల్యాంకనం

చిత్తూరు సెంట్రల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ సోమవారం జిల్లా కేంద్రమైన చిత్తూరు పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదలైంది. వివిధ సబ్జెక్టులకు సంబంధించి పలు జిల్లాల నుంచి చిత్తూరుకు చేరిన 1.50 లక్షల జవాబు పత్రాలను ఈనెల 31వ తేదీ వరకు మూల్యాంకనం చేయనున్నారు. ఇందుకోసం సీనియారిటీ ఆధారంగా 39 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 215 అసిస్టెంట్ ఎగ్జామినర్లు, ఇంగ్లీషుకు 60 మంది, మ్యాథ్స్‌కు 60 మంది, తెలుగుకు 40 మంది, హిందీకి 15 మంది, సివిక్స్‌కు 40 మందికి మూల్యాంకన విధులు కేటాయించినట్లు డీవీఈవో సయ్యద్ మౌల తెలిపారు. సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు పడకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

హత్యారాజకీయాలను ఉక్కుపాదంతో అణచివేస్తాం

- టీడీపీ నేతలు



చిత్తూరు సిటీ, మార్చి17 (ఆంధ్రజ్యోతి): హత్యా రాజకీయాలను ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేస్తుందని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్, పార్టీ చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ అన్నారు. సోమవారం చిత్తూరు జిల్లా పార్టీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో పెద్దిరెడ్డి అనుచరులు పుంగనూరు నియోజకవర్గంలో అనేకమంది ప్రజల ఆస్తులను కబ్జా చేసి భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. ప్రభుత్వం మారిన తర్వాత కూడా అదే నేర వృత్తిని కొనసాగిస్తున్న వైసీపీ నాయకులు, వారి అనుచరులను ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేస్తుందని హెచ్చరించారు.వృత్తి ధర్మాన్ని పాటించకుండా ఇంకా నేరస్తులకు కొమ్ముకాస్తున్న కొంతమంది పోలీసులపై ఎస్పీ చర్యలు తీసుకోవాలని కోరారు. పూతలపట్టు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ధరణి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంచు దుప్పట్లో మఠంపల్లెమిట్ట



ఐరాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఎండలు మండిపోతున్నా రాత్రి పూట మంచు కురవడం ఆగలేదు. సోమవారం కురిసిన పొగమంచు కారణంగా ఉదయం 7.30 గంటలైన్నా రోడ్డు సరిగా కనిపించక ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

'పీజీఆర్ఎస్'కు 279 అర్జీలు

- డీఎస్సీ ఉచిత శిక్షణ కేంద్రాన్ని చిత్తూరులోనే ఏర్పాటు చేయాలి
- ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల వినతి



బాధితురాలితో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఉచిత శిక్షణ కేంద్రాన్ని జిల్లా కేంద్రమైన చిత్తూరులోనే ఏర్పాటు చేయాలని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఈ మేరకు అర్జీ సమర్పించారు. త్వరలో డీఎస్సీ ఉంటుందన్న నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించిందన్నారు. జిల్లాలో చాలా మంది దరఖాస్తు చేసుకున్నామన్నారు. అయితే ఎంపికైన అభ్యర్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లి శిక్షణ తీసుకోవడం కష్టమవుతుందని చెప్పారు. చిత్తూరులోనే కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. బాధితుల నుంచి ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరితోపాటు పలువురు అధికారులు అర్జీలను స్వీకరించారు. మొత్తం 279 అర్జీలు అందాయి. శాఖలవారీగా.. రెవెన్యూకు 229, డీఆర్‌డీఏకు 21, పోలీసులకు 13, విద్యుత్‌కు 4, డీఎస్‌వోకు 4, డీఎంహెచ్‌కు 3, చిత్తూరు, నగరి, పలమనేరు మున్సిపాలిటీల కమిషనర్లు, ఐసీడీఎస్, జిల్లా పంచాయతీరాజ్‌శాఖకు ఒక్కో అర్జీ వంతున అందాయి.

ప్రధాన అర్జీలిలా..

- సీఎంసీ ఆస్పత్రిని ఎన్టీఆర్ వైద్యసేవ పరిధిలోకి తేవాలని జిల్లా ముస్లిం ఐక్యవేదిక నేతలు కోరారు. గుడిపాల మండలం చీలాపల్లె వద్ద సీఎంసీ ఆస్పత్రి ఉందన్నారు. అత్యవసర చికిత్సలకు ఉద్యోగులు, పెన్షనర్లు, జిల్లా ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని చెప్పారు.
- తమ గ్రామానికి సమీపంలో ఉన్న సర్వే నెంబరు 100లో 4.25 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఈ భూమి పరిధిలోని ఊరగుట్టపై ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి పాదాల ఆనవాళ్లు ఉన్నాయని ఐరాల మండలం పుల్లూరుకు చెందిన రైతులు తెలిపారు. ఈ భూమికి సమీపంలోనే సర్వే నెంబరు 424లో గొల్లయాదవ కుంటలో పశువుల మేతకు, నీరు తాగడానికి ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఈ భూములకు సమీపంలో ఉన్న డీకేటీ, పట్టా భూములను కొన్న ఓ వ్యక్తి పశువుల మేతకు వెళ్లేదారి, నీటి కుంటకు ఆక్రమించుకున్నాడని వాపోయారు. విచారించి న్యాయం చేయాలని కోరారు.
- సర్వే నెంబరు 18లో శ్మశానవాటిక కోసం ప్రభుత్వం ఎకరం భూమిని కేటాయించిందని, ఈ భూమిలో ఓ వ్యక్తి బోరు వేశాడని కార్వేటినగరం మండలం కేశవకుప్పం ఎస్టీకాలనీకి చెందిన యానాదులు ఫిర్యాదు చేశారు. విచారించడంతోపాటు శ్మశానానికి ప్రహరీ, సీసీ రోడ్డును వేయాలని కోరారు.
- సర్వే నెంబరు 338-3, 938-1లో 25 కుటుంబాల వారికి ఇంటి స్థలాలను మంజూరు చేశారని కార్వేటినగరం మండలం కారితోట యానాదులు తెలిపారు. ఈ ఇంటి స్థలాలకు చుట్టూ పురుషోత్తం మొదలియార్ కుటుంబీకులు కంచె ఏర్పాటు చేశారని చెప్పారు. దీనివల్ల ఇళ్ల నుంచి ఎటూ వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. అలాగే కాశీవిశ్వేశ్వర ఆలయ భూమిని కూడా ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేశారు. పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.



చిత్తూరులోనే డీఎస్సీ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలంటున్న నిరుద్యోగులు



కార్వేటినగరం మండలం కారితోట యానాదులు

జిల్లా పోలీసు కార్యాలయానికి 57 అర్జీలు



బాధితుల అర్జీని పరిశీలిస్తున్న ఏఎస్పీ రాజశేఖర్‌రాజు

జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 57 అర్జీలు అందాయి. బాధితుల నుంచి ఏఎస్పీ రాజశేఖర్‌రాజు వినతిపత్రాలను స్వీకరించారు. భూ తగాదాలపై 18, కుటుంబ తగాదాలపై 11, డబ్బు తగాదాలపై 7, వేధింపులపై 6, దారి తగాదాలపై 5, చీటింగ్‌పై 3, సైబర్ క్రైమ్‌పై 2, ఇంటి తగాదాలపై 2, భర్తవేధింపులపై 2, ఆస్తి తగాదాపై ఓ అర్జీ చొప్పున వచ్చాయి.

వేలాది నేత కుటుంబాలకు లబ్ధి

- చేనేత, మరమగ్గాలకు ఉచిత విద్యుత్ అందించేందుకు సర్కారు గ్రీన్‌సిగ్నల్

తిరుపతి/నగరి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గం సోమవారం తీసుకున్న నిర్ణయం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వేలాది నేత కుటుంబాలకు ఆర్థికంగా లబ్ధి చేకూర్చనుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం చేనేత కార్మికుల ఇళ్లకు నెలకు 200యూనిట్ల వరకు, అలాగే మరమగ్గాలకు 500యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీని వల్ల రాష్ట్ర మొత్తం మీద అత్యధికంగా ఉమ్మడి చిత్తూరుజిల్లాలో చేనేత, మరమగ్గాల కార్మికులకు ఆర్థికంగా మేలు కలగనుంది. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో మదనపల్లె, నగరి, పుత్తూరు ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో మరమగ్గాలు నడుస్తుండగా వెంకటగిరి, నారాయణవనం, మదనపల్లె ప్రాంతాల్లో చేనేత మగ్గాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. మదనపల్లె పట్టణంలో సుమారు 4వేల వరకు మరమగ్గాలు నిర్వహిస్తున్నారు. అలాగే నగరిలో 5వేలు, పుత్తూరులో 2వేలు చొప్పున ఉన్నాయి. ఈ 11వేల మరమగ్గాలకు సంబంధించి ఎక్కువ మంది యజమానులకు ఉచిత విద్యుత్తురూపంలో ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది. అదే విధంగా మదనపల్లెలో 5వేలు, వెంకటగిరిలో 2వేలు, నారాయణవనంలో 1200చొప్పున ఉమ్మడి చిత్తూరుజిల్లాలో ఎనిమిది వేలకు పైగా చేనేత మగ్గాలు పనిచేస్తున్నాయి. ఈ చేనేత కార్మికుల ఇళ్లకు నెలకు 200యూనిట్ల వరకు విద్యుత్తు ఉచితంగా సరఫరా చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించడం ఆ కుటుంబాలకు ఆర్థికంగా ఊరట కలిగించనుంది. గత ఎన్నికల్లో చేనేత వర్గాలకు కూటమి పార్టీలు ఇచ్చిన హామీలో భాగంగా ప్రభుత్వం తాజాగా ఈ నిర్ణయం తీసుకుంది. ఆర్థికంగా ప్రయోజనం కలిగించే ప్రభుత్వ తాజా నిర్ణయం పట్ల జిల్లాలోని చేనేత కార్మికుల కుటుంబాలు, మరమగ్గాల యజమానులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయం చేనేత రంగం కోలుకునేందుకు ఎంతగానో ఉపకరిస్తుందని ఆ వర్గాలు సంబరపడుతున్నాయి.



థ్యాంక్యూ బాబూ: నగరిలో చంద్రబాబు చిత్రపటానికి మరమగ్గ, చేనేత కార్మికుల పాలాభిషేకం

టీడీపీ శ్రేణులు తిరగబడితే

వైసీపీ వారు ఎక్కడా తిరగలేరు

- టీడీపీ నేతలు జగన్మోహన్‌రాజు,సీఆర్.రాజన్

పుంగనూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అరాచకాలు, దౌర్జన్యాలు, దాడులకు పడబోయే శిక్ష రాష్ట్రంలో అందరికీ గుణపాఠం కాబోతుందని అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్ అన్నారు.పుంగనూరు మండలం కృష్ణాపురంలో టీడీపీ కార్యకర్త కె.రామకృష్ణ దారుణ హత్యకు గురైన నేపథ్యంలో సోమవారం ఆయన కుమారులు శివ, సురేశ్‌లను చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్.రాజన్‌తో కలసి ఆయన పరామర్శించారు.రామకృష్ణ కర్మకిర్యలకు చమర్తి జగన్మోహన్ రూ.లక్ష, సీఆర్ రాజన్ రూ.10 వేల చొప్పన ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ గతంలో దేశమంతా ఒకే రాజ్యాంగం ఉంటే పుంగనూరులో మాత్రం కొత్తగా పెద్దిరెడ్డి రాజ్యాంగం నడిపించారని ఆరోపించారు. పెద్దిరెడ్డి, వైసీపీ వాళ్లు ప్రభుత్వం మారినా పాత భ్రమల్లోనే ఉంటూ అరాచకాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్నది చంద్రబాబు ప్రభుత్వమన్నారు. పెద్దిరెడ్డి లాంటి హత్యారాజకీయాలు ప్రోత్సహించిన వారికి శిక్షపడదనే భ్రమలో వైసీపీ నాయకులున్నారని, సీఎం చట్టబద్ధమైన పాలన చేస్తుండటంతో వారు చేసిన అరాచకాలకు ఆలస్యమైనా పడే శిక్ష అందరికీ ఆదర్శంగా, తప్పుచేయాలంటే భయపడేలా ఉంటుందని పేర్కొన్నారు.ఇక్కడ అరాచకసంస్కృతిని మార్చడానికి సీఎం కంకణం కట్టుకున్నారని చెప్పారు.సీఎం చంద్రబాబు మాజీ సీఎం జగన్ మాదిరిగా ఆలోచించివుంటే రాష్ట్రంలో ఎక్కడా వైసీపీ వారు తిరగలేరని హెచ్చరించారు.ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ఇలాగే హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తూ వుంటే టీడీపీ శ్రేణులను కూడా తాము ఎక్కువ రోజులు ఆపలేమన్నారు.సీఎం ఆదేశాలతో ఓర్పుతో ఉన్న వారు తిరగబడితే ఎవరూ ఆపలేరని హెచ్చరించారు. ఖాదీ, చిన్నపరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్ కేకే చౌదరి,టీడీపీ మాజీ ఇన్‌చార్జి ఎం.వెంకటరమణరాజు,నాయకులు భాస్కర యాదవ్, సుబ్రహ్మణ్య రాజు, రామకృష్ణమరాజు, దొరస్వామినాయుడు,సిద్దప్ప, రవి తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణ కుమారులకు ఆర్థిక సహాయం చేస్తున్న జగన్మోహన్‌రాజు, సీఆర్ రాజన్

హైదరాబాదులో కొమరగుంటవాసి ఆత్మహత్య

- అనుమానం వ్యక్తం చేస్తున్న కుటుంబీకులు

వెదురుకుప్పం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలంలోని కొమరగుంటకు చెందిన జి.మహేష్ అలియాస్ మహేష్‌కుమార్‌రెడ్డి(30).. హైదరాబాదులో ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై ఆయన కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. కొమరగుంటకు చెందిన మహేష్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా హైదరాబాదులో పనిచేసేవాడు. తమ ఊరికి పక్కన ఉన్న గ్రామానికి చెందిన ఓ యువతితో ఏడాది క్రితం వివాహం జరిగింది. ఆమె కూడా హైదరాబాదులోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. పెళ్లయిన నెలలకే మహేష్‌కు ఉద్యోగం పోయింది. నార్సింగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంధంగూడ శ్రీనివాస్‌నగర్ కాలనీలో నివాసం ఉంటూ.. ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నాడు. మరోవైపు ఉద్యోగం పోవడంతో ఇంట్లో మనస్పర్థలు మొదలయ్యాయి. ఆదివారం కొమరగుంటలో జరిగిన జల్లికట్టు వస్తానని చెప్పి రాలేదు. ఈ నేపథ్యంలో తన భార్య విధులకు వెళ్లగా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబీకులకు సోమవారం సమాచారం అందింది. ఆగ్రహించిన మహేష్ అన్న లోకేశ్, కుటుంబీకులు వెదురుకుప్పం పోలీసుస్టేషన్ చేరుకున్నారు. మహేష్ మృతిపై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదు తీసుకోవాలని కోరడంతో తమ పరిధి కాదని పోలీసులు తిరస్కరించారు. కాగా, మంగళవారం వేకువ జాముకంతా స్వగ్రామానికి మృతదేహం వస్తుందని బంధువులు తెలిపారు.



మహేష్(ఫైల్‌ఫొటో)

స్వర్ణ రథంపై వరసిద్ధుడి విహారం

- వైభవంగా సంకటహర గణపతి వ్రతం

ఐరాల(కాణిపాకం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి సోమవారం రాత్రి స్వర్ణరథంపై విహరించారు. స్వామిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం మూల విరాట్‌కు వైభవంగా అభిషేకం చేసి.. ఉత్సవర్లను ఆలయ ఆస్థాన మండపానికి సిబ్బంది భక్తిశ్రద్ధలతో తీసుకొచ్చారు. మండపంలోని వేదికపై ఉత్సవర్లను కొలువుదీర్చి విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాల ఎదుట భక్తులను కూర్చోబెట్టి సంకటహర గణపతి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈవో పెంచలకిషోర్, ఏఎస్పీ రాజశేఖర్ రాజు, ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు. కాగా, కోడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అరవశ్రీధర్ సోమవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు.



స్వర్ణ రథంపై సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడు

వేసవిని ఎదుర్కోవడానికి విద్యుత్ శాఖ చర్యలు

- 100కేవీ స్థానంలో 160కేవీ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



సంతపేటలో 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చుతున్న సిబ్బంది

చిత్తూరు రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వేసవిని ఎదుర్కోవడానికి విద్యుత్ శాఖ చర్యలు మొదలు పెట్టింది. మండుతున్న ఎండల కారణంగా వినియోగదారులు ఏసీలు వినియోగిస్తున్న నేపథ్యంలో రోజు రోజుకూ విద్యుత్ వాడకం అధికమైంది. అదనపు లోడ్ నమోదవుతుండడంతో ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్యూర్లు అయ్యే అవకాశం ఉంటుంది. దీంతో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం తప్పదు. దీన్ని నివారించడానికి చిత్తూరు నగరంలో అధిక లోడ్ నమోదవుతున్న 14 ప్రాంతాలను అధికారులు గుర్తించారు. సోమవారం చిత్తూరు అర్బన్ డివిజన్ ఈఈ మునిచంద్ర ఆదేశాలతో గిరింపేట, సంతపేట, కొంగారెడ్డిపల్లె ప్రాంతాల్లో 100 కేవీ స్థానంలో 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చినట్లు టౌన్ డీఈ ప్రసాద్ తెలిపారు.

పీఆర్ ట్రైనింగ్ సెంటర్‌కు స్థల పరిశీలన



స్థల పరిశీలనకు వచ్చిన అధికారులు

గంగాధరనెల్లూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ (పీఆర్)శాఖ ఆధ్వర్యంలో ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు కోసం అధికారులు సోమవారం సాయంత్రం గంగాధరనెల్లూరు పంచాయతీ పరిధిలో స్థల పరిశీలనకు వచ్చారు. చిత్తూరు - పుత్తూరు రహదారిలో మెగా లెదర్ ఫ్యాక్టరీ కోసం సేకరించిన భూములను పీఆర్ డీఈ ఆనందరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ భార్గవి పరిశీలించారు. ఎన్ని ఎకరాలు కావాల్సి వస్తుంది, రికార్డుల పరంగా ఏ సర్వే నెంబరు పరిధిలో ఎంత విస్తీర్ణం ఉందో తెలుసుకున్నారు. మొత్తం రెండెకరాలు అవసరం అవుతాయని, ప్రస్తుతం పరిశీలించిన భూమి అనువుగా ఉంటుందని పీఆర్ డీఈ, తహసీల్దార్ ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఈ సమాచారాన్ని జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. ఈకార్యక్రమంలో పీఆర్ ఏఈ సుగుణాకర్‌రావు, సచివాలయం సర్వేయర్ వాసు పాల్గొన్నారు.

గడువులోగా ప్రజా సమస్యలు పరిష్కరించాలి


ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన గడువులోగా ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలని కడా పీడీ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. కుప్పం మండల సచివాలయంలో సోమవారం ఆయన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. ఆయా ప్రభుత్వ శాఖల అధికారులకు పరిష్కారం కోసం అర్జీలను కేటాయించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ ఒకే అంశంపై ప్రజలనుంచి పదేపదే ఫిర్యాదులు అందినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

చెత్తబుట్టల పంపిణీ



కుప్పం రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.సదుమూరు పంచాయతీలో సోమవారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ చెత్తబుట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి బాలక్రిష్ణ, మాజీ సర్పంచి రామచంద్ర, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు చంద్ర, మోహన్, ప్రకాశ్, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతుల సంక్షేమంపై సీఎం ప్రత్యేక దృష్టి

రామకుప్పం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పాడిరైతుల సంక్షేమంపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని టీడీపీ రామకుప్పం మండలం అధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని నక్కబాలేపల్లె గ్రామంలో పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత లింగ నిర్ధారిత, కృత్రిమ గర్భధారణ సేవా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పశువైద్య నిపుణుడు మోహిద్దీన్, రామకుప్పం, కొంగనపల్లె పశువైద్యాధికారులు రవిశంకర్, చంద్రశేఖర్, టీడీపీ నేతలు రమేష్‌రెడ్డి, మురళీమోహన్, కృష్ణమూర్తి, రాజగోపాల్, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి ఆస్పత్రి ప్రారంభం

రామకుప్పం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని వళ్లీ దేవసేన సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ఆవరణలో ఆలయ అభివృద్ధి కమిటీ, ఈమాస్-స్విస్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి ఆస్పత్రిని కడ పీడీ వికాస్‌మర్మత్, ఈమాస్-స్విస్ రెఫరల్ ఆస్పత్రి చైర్మన్ జాకబ్ ప్రారంభిస్తారని కమిటీ పెద్దలు సీతాపతి సోమవారం తెలిపారు. ఈ ఆస్పత్రిలో ప్రతి సోమ, గురు, శనివారాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు నిపుణులైన కంటి వైద్యులు రోగులకు కంటి పరీక్షలు, చికిత్సలు అందజేస్తారని ఆయన తెలిపారు.

పశువులకు ఉచితంగా గర్భధారణ ఇంజెక్షన్లు

శాంతిపురం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పశువులకు ఉచితంగా పెయ్య దూడల ఇంజెక్షన్లు అందిస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు బాష్యం విశ్వనాథనాయుడు తెలిపారు. సోమవారం శాంతిపురం పశువైద్య కార్యాలయంలో కృత్రిమ గర్భధారణ పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ, ఎన్‌డీడీబీ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వాహాతుల్లా, టీడీపీ నేతలు ఏఎంసీ నాగరాజు, రమేష్, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి నాగరాజు, గడ్డూరు రమేష్, రాధాకృష్ణ, చలపతి పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏడుగురు గైర్హాజరు

శాంతిపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): శాంతిపురంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని తొలిరోజు సోమవారం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని వివరించారు. నాలుగు కేంద్రాలలో 743 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా ఏడుగురు రాయలేదని వివరించారు. విద్యాశాఖ అధికారులు అన్ని వసతులు కల్పించారు.

విశ్రాంత ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి



తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న విశ్రాంత ఉద్యోగులు

పుంగనూరు రూరల్, మార్చి17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని పుంగనూరు విశ్రాంత ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు నిలబడి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీటీ నాగేశ్వర్‌రావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు చెంగారెడ్డి, రామకృష్ణారెడ్డి, రమణారెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

వేసవిలో ద్రవాహారం ఎక్కువగా తీసుకోండి


బల్ల గ్రామంలో వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పూజిత

రామకుప్పం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): విజలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పూజిత తమ సిబ్బందితో కలిసి సోమవారం విజలాపురం లోని బల్ల పాఠశాల, బల్ల గ్రామంలో వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండలు పెరుగుతున్న క్రమంలో ప్రజలు ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచించారు. మజ్జిగ, కొబ్బరినీళ్లు, ఓఆర్ఎస్ ద్రావణం వంటివి తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బాలు, హెచ్ఎస్ కృష్ణవేణి, హెచ్‌వి ప్రమీళ, సీహెచ్‌ఓ చంద్రమణి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్ వద్ద ఆక్రమణలు పట్టించుకోండి



పలమనేరు, మార్చి17 (ఆంధ్రజ్యోతి): పలమనేరు పెద్దచెరువు కట్టపై ఆక్రమణలను అధికారులు పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు. చెరువుకట్టకు ఆనుకొని ఉన్న బైపాస్‌లో కొందరు ఆక్రమణ దారులు మట్టినింపి ఆక్రమణ చేసేందుకు సిద్ధపడుతున్నారు. అధికారులు స్పందించి ఆక్రమణను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కంటి వ్యాధులపై నిర్లక్ష్యం తగదు

సోమల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కంటి వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేయ రాదని సోమల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జయసింహ పేర్కొన్నారు. సోమవారం స్థానిక వైద్యశాలలో చెన్నైకి చెందిన ఎంఎం కంటి ఆసుపత్రి వైద్యనిపుణులు ఉచిత వైద్యపరీక్షలు జరిపారు. 56 మందికి వివిధ కంటి జబ్బులకు చికిత్స చేసి ఉచితంగా మందులు అందజేశారు. 20 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేసి చెన్నై వైద్యశాలకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో క్యాంపు కో-ఆర్డినేటర్ అంజినేయులు, నాగరాజు, అమరనాథ్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ సరుకుల వితరణ


ఇఫ్తార్‌కు సరుకులు అందజేస్తున్న దాతలు

సోమల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సోమల మండలం నంజంపేటలో తిరుపతి శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి యజమాని సూర్యసేన్ రంజాన్ పండుగ పురస్కరించుకుని 300 ముస్లిం కుటుంబాలకు పలు రకాల నిత్యావసర సరుకులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల కో-ఆర్డినేటర్ షేక్ బాబర్, మత గురువు ఉమర్ ఫారుక్, ముస్లిం యువత పాల్గొన్నారు.

ఏడుగురు విద్యార్థుల గైర్హాజరు

సోమల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని సోమల, పెద్దఉప్పరపల్లె, కందూరు హైస్కూల్లో పది పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. సోమల హైస్కూల్లో 71 మంది, కందూరులో 121మంది, పెద్దఉప్పరపల్లెలో 174 మంది విద్యార్థులకు గాను ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

సదుం: సదుం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షా కేంద్రంలో పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు జరిగిన తెలుగు పరీక్ష నిర్వహణను ఫ్లయింగ్ స్క్వాడ్ రెండు పర్యాయాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 249 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా ముగ్గురు గైర్హాజరు అయినట్లు చీఫ్ ఇన్విజిలేటర్ నిరంజన్ కుమార్ తెలిపారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న పెన్షనర్లు

పలమనేరు, మార్చి17(ఆంధ్రజ్యోతి) : 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని సోమవారం పలమనేరు తహసీల్దార్ ఆర్టీఓ కార్యాలయాల ఎదుట పెన్షనర్లు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం వారు ఆర్డీవో భవానీ, తహసీల్దార్ ఇన్బనాథన్‌లకు వినతిపత్రాలు అందజేశారు. ఏపీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు క్రిష్ణమూర్తి, కార్యదర్శి గురురాజారావు, పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు.

నలగుండ్రాయస్వామికి కలశారాధన హోమం



బైరెడ్డిపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడపనత్తం గ్రామంలో కొలువైవున్న నలగుండ్రాయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమ వారం ఉదయం కలశారాధన హోమం నిర్వహించారు. స్వామివారికి అభిషేకం చేశారు. సాయంత్రం స్వామి వారు శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలువురు భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్త మురళీస్వామి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తొలిరోజు తెలుగు పరీక్ష ప్రశాంతం


కుప్పంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాల వద్ద పరీక్షలు పూర్తయ్యాక గుమికూడిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

కుప్పం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం, కుప్పం మండల పరిధిలో సోమవారం పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు విద్యార్థులు 99.5 శాతం హాజరయ్యారు. మొత్తం 9 పరీక్ష కేంద్రాల్లో 1841 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా పది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

రొంపిచెర్ల: రొంపిచెర్ల బాలుర జడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 171 మంది తెలుగు పరీక్షకు హాజరు కావాల్సి వుండగా నలుగురు హాజరు కాలేదు. బాలికల ఉన్నత పాఠశాలలో 98 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలకు చీఫ్ అధికారులుగా పజులల్లా, మంజువాణి, డిపార్టుమెంట్ అధికారులుగా సయ్యద్‌బాషా, రాజేంద్ర పాల్గొన్నారు. ఎస్‌ఐ సుబ్బారెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

చౌడేపల్లె: పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సోమవారం స్థానిక హైస్కూల్- 1, 2 పరీక్షా కేంద్రాలలో 500 మంది విద్యార్థులకు గాను 492 మంది పరీక్షలు రాశారు. 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో కేశవరెడ్డి పేర్కొన్నారు.

పలమనేరు: పలమనేరు మండలంలో 10 వతరగతి పరీక్షలు 7 కేంద్రాల్లో ప్రారంభమయ్యాయి. పలమనేరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నతపాఠశాల, ఓవర్‌వల్ హైస్కూల్, బాలికోన్నత పాఠశాల, ఏలీనా ఇంగ్లీష్ మీడియం స్కూల్, కొలమాసనపల్లె ఉన్నత పాఠశాల, పెంగరగుంట ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాల్లో సోమవారం మొత్తం 1377 మంది విద్యార్థులకు గాను 1368 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 9 మంది మాత్రమే గైర్హాజరు అయ్యారు. జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు అరుణ్‌కుమార్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. అన్నిపరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు ప్రశాంతంగా రాశారని ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం తెలిపారు.

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లెలో జడ్పీ బాలుర, బాలికోన్నత పాఠ శాలలు, కమ్మనపల్లె ఆదర్శ పాఠశాలలు పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. మూడు కేంద్రాల్లోనూ 595 మంది విద్యార్థులకుగాను మొదటిరోజు ఏడుగురు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద తగిన బందోబస్తు ఏర్పాటుచేశారు.

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం


పుంగనూరులో విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపుతున్న పోలీసులు


కల్లూరు పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

పుంగనూరు రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పుంగనూరులో సోమవారం 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 8 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 1348 మంది హాజరు కావాల్సివుండగా 1335 మంది మాత్రమే హాజరైనట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశామని ఎంఈవో తెలిపారు.

కల్లూరు: పులిచెర్ల మండలంలోని కల్లూరు, మంగళంపేట పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా మొదలయ్యాయని ఎంఈవో సిద్ధరామయ్య తెలిపారు. కల్లూరు పరీక్షా కేంద్రంలో 205 మంది విద్యార్థులకు 202 మంది విద్యార్థులు హాజరుకాగా ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. మంగళంపేట పరీక్షా కేంద్రంలో 110 మంది విద్యార్థులకు అందరూ హాజరయ్యారని వివరించారు. కల్లూరు, మంగళంపేట చీఫ్ సూపరింటెండెంట్లు హరిశంకర్, లక్ష్మీదేవి, డిపార్టుమెంటల్ అధికారులుగా రవి, మోహన్‌రెడ్డి, మంగళంపేట జెడ్పీహెచ్ఎస్ ఎంఈవో పోకల తాతయ్య విధులు నిర్వహించారు. కల్లూరు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది బందోబస్తు చర్యలు చేపట్టారు.

బలిజల సమస్యలకు సత్వర పరిష్కారం


సమావేశంలో మాట్లాడుతున్న గోపీనాథ్ తదితరులు

కుప్పం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలోని బలిజ కులస్తులకు ఎటువంటి సమస్యలున్నా సత్వర పరిష్కారానికి ప్రయత్నిస్తామని శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం అధ్యక్షుడు పి.గోపీనాథ్ హామీ ఇచ్చారు. డీకేసీ భ్యాంకు ఆవరణలో సోమవారం సంఘం తరఫున ప్రత్యేకంగా కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు 2018లోనే బలి కులస్తుల కమ్యూనిటీ భవన నిర్మాణానికి 2.46 ఎకరాల భూమిని కేటాయించారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ స్థలంలో కమ్యూనిటీ భవన నిర్మాణంకోసం తనవంతు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాగేంద్రరావు, సేలం విజయకుమార్, డాక్టర్ పి.ప్రకాశ్, ఆర్ఎస్.మణి, డీలర్ వెంకటేశ్, జయదేవ్, మంజునాథ్, రాజేంద్ర, అనసూయ, సుగుణమ్మ, సోము, నాను, పవన్, మహేశ్, బలరాం, శేషు, శ్రీనివాసులు, పొట్లూరు, దేవ, నాగరాజు, కంగుంది మంజు, చంద్ర పాల్గొన్నారు.

కులం పేరుతో దూషణ.. ఒకరిపై కేసు నమోదు

రామకుప్పం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): స్థల వివాదం నేపథ్యంలో ఓ మహిళను కులం పేరుతో దూషించిన వ్యక్తిపై పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. రామకుప్పం ఎస్‌ఐ వెంకటమోహన్ కథనం మేరకు.. మండల పరిధిలోని సోమకుప్పం, ప్రకాష్(45) కుటుంబాల మధ్య కొంత కాలంగా స్థల వివాదం సాగుతోంది. ఈ నెల 14న వారి మధ్య స్థలం విషయమై మరోసారి వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో వెంకటమ్మను ప్రకాష్ కులం పేరుతో దూషించడంతో సోమవారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ప్రకాష్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టారు.

భోజన టేబుళ్లపై పది పరీక్షలు



వి.కోట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): వి.కోట మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సోమవారం మొదటి రోజు ఆరు పరీక్షా కేంద్రాలో 1104 మందికి గాను 1087 మంది పరీక్షలకు హాజరుకాగా 17 మంది పరీక్షలకు హాజరు కాలేదు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంలో రెండు గదుల్లో డెస్కులు చాలకపోవడంతో భోజనం చేసే టేబుళ్లను, కుర్చీలను ఏర్పాటు చేశారు. వాటిపై పరీక్ష రాసేందుకు విద్యార్థులు ఇబ్బంది పడ్డారు.

పగలైనా వెలుగుతున్న వీధిదీపాలు



సోమల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సోమలలోని పలువీధుల్లో వీధిదీపాలు పగటి పూటా వెలుగుతున్నాయి. మండల సమావేశంలో వీధిదీపాలు నిత్యం వెలుతురుతుండడంపై సభ్యులు ప్రశ్నించినా అధికారులు పట్టించుకోవడం లేదు. పంచాయతీకి కొంటున్న బిల్లుల మోత మోగుతోంది.

ఎంటెక్, ఎంబీయే పరీక్ష ఫలితాల్లో కేఈసీ విద్యార్థుల ప్రతిభ


పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న బీసీఎస్, డాక్టర్ చిత్ర

కుప్పం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఇంజనీరింగ్ కళాశాల అటానమస్ హోదాలో పీజీవరి నెలలో నిర్వహించిన ప్రథమ సంవత్సర ఎంటెక్, ఎంబీయే ప్రథమ సెమిస్టర్ ఫలితాలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు బీసీఎస్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ.నాగరాజ్, జేఎన్‌టీయూ ఎగ్జామినేషన్స్ పరిశీలకులు ప్రొఫెసర్ డాక్టర్ వీడీ.చిత్ర, కేఈసీ ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎంకోసుందరం తెలిపారు. సోమవారం వీరు ఫలితాలను విడుదల చేశారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో జోష్న 87.97 శాతం మార్కులతో ప్రథమ స్థానం, ఎంబీఏ విభాగంలో బిహార్షిత రాజ్ 96.76 శాతం మార్కులతో ద్వితీయ స్థానం, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఎం.పవిత్రలక్ష్మి 86.49 శాతం మార్కులతో తృతీయ స్థానంలోను నిలిచినట్లు వెల్లడించారు. అత్యధిక శాతం విద్యార్థులు డిస్టింక్షన్, ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. అలాగే ఎంబీయే ఫలితాలలో బీవీఎల్.నాగలక్ష్మి 87.75 శాతం, ఎస్.సౌమ్యశ్రీ 86.25 శాతం, ఎం.ఉదయశ్రీ 84.38 శాతం మార్కులతో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచినట్లు పేర్కొన్నారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులను, అధ్యాపకులను బీసీఎస్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ.నాగరాజ్, కుప్పం ఇంజనీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ ఎస్.సునీల్‌రాజ్, సీఈవో ఎస్.సాగర్‌రాజ్, ఎంబీయే విభాగాధిపతి మునీంద్ర, విభాగాధిపతులు అభినందించారు.

రేపు వారపు సంత వేలం

చౌడేపల్లె, మార్చి17(ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె వారపు సంత గేటు ఏడాది పాటు నిర్వహించుకునేందుకు ఈ నెల 19న వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి మహేష్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సంత గేటు వేలంలో పాల్గొనేవారు రూ.5 లక్షలు డిపాజిట్, ప్రైవేటు బస్టాండ్ నిర్వహణకు రూ.30వేలు డిపాజిట్, క్యూరింగ్‌బెల్టుకు రూ. 1000 డిపాజిట్ చేసి పాల్గొనవచ్చునని వివరించారు.

సైరన్ లాకర్లతో రక్షణ

రొంపిచెర్ల మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సైరన్ లాకర్లతో దొంగల బారి నుంచి రక్షణ పొందవచ్చని రొంపిచెర్ల ఎస్‌ఐ సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం ఆయన సైరన్ లాకర్లపై అవగాహన కల్పించారు. అవసరమైన వారికి రూ.500లకు లీగాలు పంపిణీ చేశారు.

విద్యాహక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న న్యాయమూర్తి షేక్ ఆరిఫా

పుంగనూరు రూరల్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టంపై విద్యార్థులకు అవగాహన కలిగివుండాలని పుంగనూరు సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఆరిఫా పేర్కొన్నారు. సోమవారం స్థానిక మేలుపట్ల ఉన్నత పాఠశాలలో ఆమె న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెరుగైన భాగా చదువుకోవాలని కోరారు. పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం లక్ష్మిరెడ్డి, ఉపాధ్యాయులు గంగప్ప భారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

మురారిపల్లెలో వైద్యశిబిరం



బైరెడ్డిపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మురారిపల్లె గ్రామంలో సోమవారం తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్ వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. సాధారణ వ్యాధులకు వైద్యపరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉంటే గళ్ల పరీక్షలు చేసుకోవాలని, వడదెబ్బ బారినపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ, ఎంహెచ్‌పీ ప్రతిమ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పైపులైన్ బాగుచేయండి

పుంగనూరు రూరల్, మార్చి17(ఆంధ్రజ్యోతి): కుక్కలపల్లె పైపులైన్లను బాగు చేయించాలని గ్రామస్తులు కోరారు. పుంగనూరు మండలం పాళ్యంపల్లె పంచాయతీ కుక్కలపల్లెలో దాదాపు నెల రోజుల క్రితం తాగునీటి పైపు పగిలింది. నీరు వీధుల్లో ప్రవహిస్తోంది. పైపులు పగిలిన చోట నీరు కలుషితమై రోగాల బారిన పడుతున్నట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు సామాజిక తనిఖీ గ్రామసభ

సోమల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సోమల స్త్రీ శక్తి భవనం ఆవరణలో 17వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభను మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నారాయణ తెలిపారు. ఉపాధి నిధులతో పంచాయతీ రాజ్, హౌసింగ్, ఉపాధి పథకం పనుల నిధుల వినియోగంపై బహిరంగ సభలో వివరిస్తామని తెలియజేశారు.

అన్నీ రెవెన్యూ సమస్యలే..!

పలమనేరు ఆర్డీవోకు పలువురి వినతులు


అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీవో భవాని

పలమనేరు, మార్చి17 (ఆంధ్రజ్యోతి): పాలకులు మారుతున్నా రెవెన్యూ శాఖలో అక్రమాలు ఆగడంలేదు. పలమనేరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక ద్వారా అందుతున్న వినతులే ఇందుకు నిదర్శనం. దాదాపు 12 మంది బాధితులు రెవెన్యూ సమస్యలపై వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఆర్డీవో భవానీకి వినతిపత్రాలు అందజేశారు. అందులో కొన్ని..

సాగు భూములకు పట్టాలివ్వండి



మేము సాగు చేసుకొంటున్న భూమి గాజులవారిపల్లె సర్వే నెంబరు పక్కనే ఉంది. చెందిన గంగులప్ప, జనవయ్య, నరసప్ప, అమరనాథ్, గీతమ్మకు చెందిందని ఐజీవీల రెవెన్యూ ఆటవీ అధికారులు సర్వేచేసి చెప్పారు. మా అనుభవంలో భూమి ఉంది. అయినా ఇలా చేశారు.

- వరలక్ష్మి, వెంకటలక్ష్మి, శారద, దిగువపల్లి పంచాయతీ మాట్లపల్లకాడ యానాది కాలనీ, చౌడేపల్లి మండలం

నష్టపరిహారం ఇవ్వలేదు



సదుం మండలం కొర్లగుంటవారిపల్లె వద్ద 2016లో ప్రాజెక్టు నిర్మాణం కోసం గ్రామానికి చెందిన సుమారు 30 మంది రైతుల నుంచి భూసేకరణ చేసింది. అందులో పలువురికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించింది. కొందరికి నేటికీ నష్టపరిహారం అందలేదు. మాకు నష్టపరి హారం ఇవ్వలేదు. ఆయినా ఇచ్చినట్టు రెవెన్యూ రికార్డుల్లో పేర్కొన్నారు. మా వద్ద రెవెన్యూ అధికారులు స్టాంపు పేపర్లపై సంతకాలు తీసుకున్నారు. విచారణ జరిపి న్యాయం చేయాలి.

- రైతులు నరసింహులు, జయరామయ్య, బాలకృష్ణ

మా భూమిని దౌర్జన్యంగా లాక్కొంటున్నారు



నా తండ్రి ఇచ్చిన 5.04 ఎకరాల భూమిని వెంకటరామిరెడ్డి అతని భార్యపై రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించుకుని దౌర్జన్యం చేస్తున్నారు. మీరే న్యాయం చేయాలి.

- కవిత, గంగవరం మండలం మామడుగు గ్రామం

పీజీఆర్ఎస్‌కు 8 అర్జీలు: కమిషనర్


బాధితుల నుంచి అర్జీ స్వీకరిస్తున్న నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి ఎనిమిది అర్జీలు అందాయని కమిషనర్ నరసంహప్రసాద్ తెలిపారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఇంజనీరింగ్‌కు 3, ప్రజారోగ్యశాఖకు 2, రెవెన్యూ, పింఛన్, ప్రధాన కార్యాలయాకి ఒక్కో అర్జీవంతున వచ్చాయి. అలాగే గతవారం అందిన అర్జీలపై అధికారులతో సమీక్షించారు. ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, ఏసీపీ నాగేంద్ర, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

స్వీపర్ల బ్యాంకు ఖాతాల్లోకి జీతాలను జమ చేయాలి


సంతపేట పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న స్వీపర్లు, ఆయాలు

చిత్తూరు అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న స్కూల్ స్వీపర్లు, ఆయాలకు ప్రతి నెలా వారి బ్యాంకు ఖాతాలకు జీతాలను జమ చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్, స్వీపర్లు, ఆయాల సంఘ అధ్యక్షురాలు జయకుమారి డిమాండ్ చేశారు. సోమవారం సంతపేట పాఠశాల వద్ద ఈ మేరకు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యాంకు ఖాతాలకు జీతాలను జమ చేస్తుంటే ఇక్కడ మాత్రం అలా చేయక పోవడం బాధాకరమన్నారు. స్వీపర్లు, ఆయాలకు గుర్తింపుకార్డులను ఇవ్వాలని, బాత్రూమ్‌లను శుభ్రం చేయడానికి అవసరమైన మెటీరియల్స్‌ను పంపిణీ చేయాలన్నారు. పనికి తగిన వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చెత్త సేకరణకు ట్రై సైకిళ్ల పంపిణీ



నింద్ర, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పంచాయితీల్లో చెత్తసేకరణకు ట్రై సైకిళ్లను ఎంపీడీవో శివప్రసాద్ వర్మ సోమవారం పంపిణీ చేశారు. చిత్తూరు డీపీఆర్‌సీ సహకారంతో నింద్ర, శ్రీరామపురం, కొప్పేడు, అత్తూరు, ఆరూరు గ్రామ పంచాయతీలకు వీటిని అందజేశామన్నారు. పంచాయితీ విస్తరణాధికారి లక్ష్మీపతి, కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి: పెన్షనర్ల వినతి


డీటీకి వినతిపత్రమిస్తున్న పెన్షనర్ల సంఘ నాయకులు

వెదురుకుప్పం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కార్వేటినగరం డీటీ త్యాగరాజుకు పెన్షనర్లు వినతి పత్రాన్ని సోమవారం అందజేశారు. తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. పెన్షనర్ల సంఘం మండల నాయకులు మోహన్‌రెడ్డి, చెంగమ్మ, విజయకుమార్ పిళ్లై తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి పూజలు


సత్యసాయి సంస్థాన్‌లో పూజలు చేస్తున్న భక్తులు

చిత్తూరు కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో సోమవారం వివిధ ఆలయాల్లో సంకట హర చతుర్థి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో వినాయకుడికి భక్తులు అభిషేకం, పూజలు చేశారు. శివగామి సుందరి చిదంబరేశ్వర ఆలయం, గంగనపల్లె వినాయక, 75 దొడ్డిపల్లె షుగర్ ఫ్యాక్టరీ సమీపంలోని సిద్ధి వినాయక, బజారువీధి సుందర వినాయక, హై రోడ్ మహాగణపతి, దుర్గానగర్ కాలనీ సర్వసిద్ధి వినాయక, కామాక్షి అంబికా సమేత అగస్త్రీశ్వరాలయాల్లోనూ సంకట హర చతుర్థి పూజలు చేశారు.

ఇళ్ల స్థలాలు చూపించండి: సీపీఐ


ఆర్డీవో కార్యాలయం వద్ద బాధితులతో కలిసి ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

నగరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): విజయపురం మండలం పాతార్కాడులో 85 మంది పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చి.. ఇప్పటికీ స్థలాలు చూపలేదని సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు రామానాయుడు చెప్పారు. వెంటనే స్థలాలు చూపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరి టవర్‌క్లాక్ వద్ద నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు సీపీఐ ఆధ్వర్యంలో బాధితులతో కలిసి ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. ప్రభుత్వం పట్టించుకోకుంటే భూపోరాటం చేసి పేదలకు భూములను పంచుతామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో పనిచేసే కార్మికులకు స్వీపర్ కాలనీ ఏర్పాటు చేశారన్నారు. నగరిలో మాత్రం ఇప్పటివరకు ఏర్పాటుకు చర్యలు తీసుకోలేదని తెలిపారు. అనంతరం ఆర్డీవో భవానిశంకరికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, ఏఐటీయూసీ పట్టణ నాయకులు మురళి, శేఖర్, నాగరాజ, రఫీ, శ్యామల, రాధ, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై ఆర్డీవో సమీక్ష

నగరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో పొరబాట్లు, సవరణపై నగరి ఆర్డీవో భవానీశంకరి సోమవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో నేతలు మాట్లాడుతూ.. కొన్ని ప్రాంతాల్లో ఒకే కుటుంబానికి చెందిన ఓట్లు రెండు వార్డుల్లో ఉన్నాయని తెలిపారు. సమస్యలను పరిష్కరిస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు. ప్రతినెలా సమావేశం నిర్వహిస్తామని, నాయకులు సలహాలు, సూచనలను ఇవ్వాలని కోరారు. మున్సిపల్ కమిషనరు, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

పశుగ్రాసం సాగుకోసం దరఖాస్తు చేసుకోండి

పాడిరైతులకు అవకాశం

గంగాధరనెల్లూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పశుగ్రాసం సాగుకోసం అర్హులైన పాడిరైతులు దరఖాస్తు చేసుకోవాలని గంగాధరనెల్లూరు వెటర్నరీశాఖ ఏడీ డాక్టర్ కాసల మురళీ మోహన్ సూచించారు. తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పాడి ఆవులు కలిగిన రైతులకు సొంతంగా 10సెంట్లు లేదా 50 సెంట్ల భూమితో పాటు బోరుబావి, నీటిసౌకర్యం ఉన్నవారు, ఆయా పశు వైద్య కేంద్రాల్లో డాక్టర్లను సంప్రదించి దరఖాస్తులు అందజేయవచ్చని చెప్పారు. 10 సెంట్ల భూమిలో సాగుచేసేవారికి రూ.6,600, 50 సెంట్ల భూమిలో పశుగ్రాసం సాగుచేసేవారికి రూ.32,900లను రెండేళ్ల కాలపరిమితితో ఉపాధి పథకం ద్వారా బ్యాంకు ఖాతాలకు జమచేస్తారన్నారు.


నేను బతికే ఉన్నా..!

రికార్డుల్లో చంపేశారని వెదురుకుప్పం మండలం సంతబైలువాసి ఆవేదన

వెదురుకుప్పం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తాను బతికున్నా.. రికార్డుల్లో మాత్రం చంపేశారని వెదురుకుప్పం మండలం సంతబైలు గ్రామానికి చెందిన నల్లపరెడ్డి గరుడేశ్వరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మీడియాకు వివరాలు తెలిపారు. 'ఎక్కడేం జరిగిందో తెలియదు.. నన్ను రికార్డుల పరంగా చంపేశారు. పైగా నువ్వు బతికే ఉన్నావని నిరూపించుకుంటేనే రేషన్ ఇస్తామంటున్నారు. నాకు కేటాయించిన ఆధార్ కార్డు నెంబరుతో వివరాలు పరిశీలిస్తే చనిపోయినట్లు చూపిస్తోంది. ఇదేంటని సంతబైలు గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళితే తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లమన్నారు. అక్కడికెళితే పట్టించుకునే నాథుడే లేరు' అని గరుడేశ్వరరెడ్డి వివరించారు. ఉన్నతాధికారులు విచారించి తనకు న్యాయం చేయాలని కోరారు. లేదంటే తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతానని హెచ్చరించాడు.



గరుడేశ్వరరెడ్డి ఆధార్ కార్డు

గరుడేశ్వరరెడ్డి - ఆధార్‌లో చనిపోయినట్లుగా నమోదు

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

నగరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. నగరి మున్సిపాలిటీలో వీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నగరి బాలికల, సత్రవాడ, ఏకాంబరకుప్పం, కొత్తపేట జడ్పీహైస్కూల్, తడుకుపేటలో జడ్పీహైస్కూల్‌లో పరీక్షలు నిర్వహించారు. 1130 మంది విద్యార్థులు హాజరయ్యారు.

విజయపురం: మండలంలోని పన్నూరు పరీక్ష కేంద్రంలో 73 మంది, విజయపురంలో 104 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు ఎంఈవో హరిప్రసాద్ వర్మ తెలిపారు.

ఐరాల: కాణిపాకం జడ్పీ హైస్కూల్‌లో 108 మంది, ఎం.పైపల్లె జడ్పీహైస్కూల్‌లో 74మంది, ముదిగోళం జడ్పీ హైస్కూల్‌లో 8 మంది, నాంపల్లె జడ్పీ హైస్కూల్‌లో 13 మంది, పొలకల జడ్పీ హైస్కూల్‌లో 55 మంది, ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 110 మంది, పుత్రమద్ది జడ్పీ హైస్కూల్‌లో ఆరుగురు విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు.

యాదమరి: మండలపరిధిలో 412 మంది విద్యార్థులుండగా.. యాదమరి జడ్పీ హైస్కూల్‌లో 370 మందికి, 42 మంది విద్యార్థులకు కేజీ సత్రం, తుమ్మింద పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

నింద్ర: ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థుల సందడి నెలకొంది. 168 మంది విద్యార్థులకు ఒకరు గైర్హాజరైనట్లు చీఫ్ శ్యామల తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ శేషగిరిరావు పరిశీలించారు.

శ్రీరంగరాజపురం: జడ్పీ ఉన్నత పాఠశాల, 49.కొత్తపల్లెమిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలల్లో 499 మందికి విద్యార్థులకు 496మంది హాజరయ్యారని ఎంఈవో అరుణాచలంరెడ్డి తెలిపారు.

తవణంపల్లె: తవణంపల్లె పరీక్ష కేంద్రంలో 166 మంది, అరగొండ కేంద్రంలో 211 మందికి 207 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో హేమలత తెలిపారు.

పూతలపట్టు: మండలంలో ఐదు పరీక్ష కేంద్రాలకు 525 మంది విద్యార్థులకు 513 మంది పరీక్షలకు హాజరయ్యారు.

గుడిపాల: కమ్మతిమ్మాపల్లి, బొమ్మసముద్రం, నరహరిపేట జడ్పీ హైస్కూలు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయని ఎంఈవోలు గణపతి, హసన్ బాషాలు తెలిపారు. ఎస్ఐ రామ్మోహన్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

వెదురుకుప్పం: కార్వేటినగరంలో 186మందికి ముగ్గురు, కత్తెరపల్లెలో 244 మందికి ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. వెదురుకుప్పం మండలంలోని పచ్చికాపల్లం పరీక్ష కేంద్రాన్ని ఎంఈవో మనోజ్ కుమార్, సీఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజ్‌కుమార్ సందర్శించారు.





నగరి, నింద్ర, కార్వేటినగరం పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థుల సందడి

పొన్నియమ్మ ఆలయ కుంభాభిషేకం



చిత్తూరు కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పొన్నియమ్మ ఆలయ మహా కుంభాభిషేకం సోమవారం జరిగింది. మహా చండీయాగంలో ఆలయ ట్రస్టీ సీకే బాబు దంపతులు పాల్గొన్నారు.

నేటినుంచి సాయిబాబా ఆలయంలోనూ..

కాగా కట్టమంచి షిరిడీ విశ్వ సాయిబాబా ఆలయ కుంభాభిషేక కార్యక్రమాలు మంగళవారం నుంచి గురువారం నిర్వహించనున్నామని ఆలయ ట్రస్టీ సీకే బాబు తెలిపారు.

అడవికి నిప్పు పెట్టిన ఆకతాయిలు


అగ్నికి ఆహుతవుతున్న వృక్షాలు

శ్రీరంగరాజపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మెదవాడ సమీపంలో అడవికి ఆకతాయిలు నిప్పు పెట్టారు. దీంతో ఎర్రచందనంతోపాటు పలురకాల వృక్షాలు అగ్నికి ఆహుతలయ్యాయని స్థానికులు తెలిపారు. అటవీశాఖ అధికారులు స్పందించి మంటలను ఆర్పాలని కోరుతున్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నగరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్ వద్ద అండర్‌బ్రిడ్జి చిన్నదిగా ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు తెలిపారు. దీంతో వాహనాలకు ఇబ్బంది లేకుండా మరో ప్రాంతంలో అండర్ బ్రిడ్జి నిర్మించాలని రైల్వే అధికారులను బీజేపీ నాయకులు కోరారు. ఏకాంబరకుప్పం ఇండియన్ బ్యాంకు ఉన్నదారిలో నిర్మిస్తే అనుకూలంగా ఉంటుందని తెలిపారు. అయితే బ్రిడ్జి నిర్మాణానికి మున్సిపల్ అధికారుల అనుమతి కావాలని రైల్వే అధికారులు చెప్పారు. దీంతో సోమవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, ఇంజనీరింగు అధికారులతో కలిసి బీజేపీ నాయకులు స్థలాన్ని పరిశీలించారు.

రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్ర భవనాన్ని ప్రారంభించండి

గవర్నర్‌ను చిత్తూరుకు ఆహ్వానించిన జిల్లా చైర్మన్



చిత్తూరు సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో నూతనంగా నిర్మించిన రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్ర భవనాన్ని ప్రారంభించాలని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను జిల్లా చైర్మన్ రమేష్ బాబు కోరారు. ఈ మేరకు సోమవారం విజయవాడ గాంధీ నగర్‌లో రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యాలయ భవన శంకుస్థాపనకు విచ్చేసిన గవర్నర్‌ను కలిసి ఆహ్వానించారు. పర్యటనపై త్వరలోనే తన కార్యాలయం నుంచి సమాచారం అందుతుందని గవర్నర్ పేర్కొన్నారు.

విద్యాపరమైన ఆడిట్ విజయవంతం


వెదురుకుప్పం డిగ్రీ కళాశాలలో అధ్యాపకులకు సన్మానం

వెదురుకుప్పం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాశాఖ ఆదేశాలతో వెదురుకుప్పం వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యాపరమైన ఆడిట్ విజయవంతంగా జరిగిందని ప్రిన్సిపాల్ అన్నపూర్ణశారద తెలిపారు. ఆడిట్‌ను అన్నమ్మయ్య జిల్లా మదనపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ శ్రీనివాసులు, రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్స్ సైన్స్ అధ్యాపకుడు జి.దయానందం నిర్వహించారని తెలిపారు.

తెలుగును ద్వితీయ భాషగా తప్పనిసరి చేయాలి


నినాదాలు చేస్తున్న తెలుగు అధ్యాపకులు

చిత్తూరు సెంట్రల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మాతృభాషను ఐచ్ఛికం(ఆప్షనల్)గా కాకుండా ఇంటర్‌లో ద్వితీయ భాషగా తప్పనిసరి చేయాలని తెలుగు అధ్యాపకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూల్యాంకనం మొదలైంది. ఈ క్రమంలో తెలుగు భాష అధ్యాపకులు తెలుగు భాషను ఇంటర్‌లో ద్వితీయ భాషగా తప్పని చేయాలని పెన్‌డౌన్ చేసి.. కొంతసేపు నిరసన తెలిపారు. ఆ తర్వాత జవాబు పత్రాల మూల్యాంకనం చేపట్టారు.

రేపు వారపు సంత వేలం

చౌడేపల్లె, మార్చి17(ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె వారపు సంత గేటు ఏడాది పాటు నిర్వహిం చుకునేందుకు ఈ నెల 19న వేలం నిర్వహిం చనున్నట్లు పంచాయతీ కార్యదర్శి మహేష్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సంత గేటు వేలంలో పాల్గొనేవారు రూ.5 లక్షలు డిపాజిట్, ప్రైవేటు బస్టాండ్ నిర్వ హణకు రూ.30వేలు డిపాజిట్, కొబ్బరిచెట్లకు రూ. 1000 డిపాజిట్ చేసి పాల్గొనవచ్చునని వివరించారు.

చేనేత, మరమగ్గ కార్మికుల సంబరాలు

నగరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు చేనేత కార్మికుల ఇళ్లకు నెలకు 200 యూనిట్ల వరకు, అలాగే మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో నగరిలో మరమగ్గ, చేనేత కార్మికులు సంబరాలు జరుపుకున్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం దృష్టికి ట్రేడ్ యూనియన్ నాయకులు, సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ నాయకులు పలుసార్లు ఈ విషయాన్ని తీసుకెళ్లినా అమలు చేయలేదని గుర్తు చేసుకున్నారు. మరమగ్గ, చేనేత రంగాలకు చెందిన చిరకాల కోరికను చంద్రబాబు తీర్చగలిగారన్నారు. ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఈ విషయాన్ని చంద్రబాబు, లోకేష్ దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేశారంటూ మొదలియార్లు, చేనేత, మరమగ్గ కార్మికులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసన్, ఆర్ముగం,మాణిక్యవాసన్,మదివాసన్,కరుణ,రజనీకాంత్,దయాళన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన కార్మికులు, నాయకులు →



సంక్షిప్తంగా..

ఎంపీపీకి పరామర్శ

విజయపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో శస్త్ర చికిత్స చేసుకున్న విజయపురం ఎంపీపీ జమునను సోమవారం మాజీ మంత్రి ఆర్కే. రోజా జగన్నాథపురంలో పరామర్శించారు. అనంతరం పాతార్కాడులో వైసీపీ నాయకుడు నారపరాజును కూడా పరామర్శించారు. మండల వైసీపీ అధ్యక్షుడు శివరాజు, గుణశేఖర్‌రెడ్డి, చెంచురాఘవరాజు, జిల్లు, భాస్కర్, సురేష్, శ్రీరాములురెడ్డి, సతీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వేలంతో రూ.11.50 లక్షల ఆదాయం

పెనుమూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు పంచాయతీలోని సంతగేటు, ప్రైవేటు వాహనాల వేలం ద్వారా రూ.11.50 లక్షల ఆదాయం వచ్చిందని సెక్రటరీ ప్రభుకిరణ్ తెలిపారు. సోమవారం సచివాలయంలో ఒక ఏడాదికి నిర్వహించిన సంతగేటు వేలం ద్వారా రూ.9.48 లక్షలు, ప్రైవేటు వాహనాల వేలం ద్వారా రూ.2.03 లక్షలు వచ్చిందని చెప్పారు. వేలంలో దక్కించుకున్నవారు ధరావత్తు మొత్తాన్ని ఏడ్రోజుల్లో చెల్లించాలని సూచించారు.

సారా కేసులో ఒకరి అరెస్టు

పాలసముద్రం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నరసింహాపురంలో సోమవారం ఎక్సైజ్ సీఐ శిరీషాదేవి, ఎస్ఐ చిన్నరెడ్డెప్ప ఆధ్వర్యంలో సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న వెయ్యి లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. అయ్యవారికండ్రిగకు చెందిన రామ్మూర్తిని అరెస్టు చేసి.. కేసు నమోదు చేశారు. గ్రామాల్లో సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ, ఎస్ఐ హెచ్చరించారు.

చెత్త బుట్టల పంపిణీ



వెదురుకుప్పం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం దేవరగుడిపల్లెలో గ్రామస్తులకు చెత్త బుట్టలను సోమవారం పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎస్.చంద్రబాబునాయుడు, మండల క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు చొక్కా మహేష్, సర్పంచ్ ఆశీర్వాదం, కార్యదర్శి మధు పాల్గొన్నారు.

గడువులోగా ప్రజా సమస్యలు పరిష్కరించాలి


ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన గడువు లోగా ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలని కడా పీడీ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. కుప్పం మండల సచివాలయంలో సోమవారం ఆయన ప్రజా ఫిర్యాదుల పరి ష్కార వేదిక నిర్వహించారు. ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. ఆయా ప్రభుత్వ శాఖల అధికారులకు పరిష్కారం కోసం అర్జీలను కేటాయించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ ఒకే అంశంపై ప్రజల నుంచి పదేపదే ఫిర్యా దులు అందినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషణ

ఒకరిపై కేసు నమోదు

రామకుప్పం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్థల వివాదం నేపథ్యంలో ఓ మహిళను కులం పేరుతో దూషించిన వ్యక్తిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. రామకుప్పం ఎస్ఐ వెంకటమోహన్ తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని వెంకటమ్మ, ప్రకాష్(45) కుటుంబాల మధ్య కొంత కాలంగా స్థల వివాదం సాగుతోంది. ఈనెల 14న వారి మధ్య స్థలం విషయమై మరోసారి వాగ్వాదం జరిగింది. వెంకటమ్మను ప్రకాష్ కులం పేరుతో దూషించాడని సోమవారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ప్రకాష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.